


నిష్పక్షపాత వార్తల నిజరూపం

# నేటిధాత్రి ®

22ND ANNIVERSARY

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

శుక్రవారం 22-05-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 49 రూ॥ 6.00







# మన పాలకులకు ఆ దమ్ముందా?

నేటిధాత్రి Exclusive



ఛీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


## అవినీతి నిర్మూలన పాలకులకు సాధ్యమేనా?

## అవినీతి అనే పదం వినపడకుండా చేయగలరా?



## తమిళనాడు సీఎం. విజయ్ లాంటి ప్రకటన తెలంగాణలో వినొచ్చా?

## స్వతంత్ర భారతావని మొదటి ఎన్నికల నుంచి వింటున్న మాటే!




- ఎన్నికలొచ్చిన ప్రతిసారి పార్టీలు చెబుతున్న మాటే!
- తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ కూడా చేసిన వాగ్దానమే!
- మరేమైంది.. పాలకులే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.
- విమర్శల పాలౌతున్నారు..ఓడిపోతున్నారు.
- అధికారుల అవినీతిని ఎలా అరికడతారు?

## •ముందు నాయకులు నిజాయితీ పరులు అనే పేరు ఎందుకు తెచ్చుకోవడం లేదు!

- అధికారుల చేత అవినీతి చేయించిదే నాయకులు అనే అపవాదు ఉండనే వుంది.
- కాదని చెప్పే ధైర్యం ఎంత మంది నాయకులకు వుంది.
- తెలంగాణలో రోజుకు కనీసం ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు పట్టుబడుతున్నారు.
- ప్రజా ప్రభుత్వం రేవంత్ సర్కార్ కొలువు తీరిన తర్వాత కొన్ని వందల మంది పట్టుబడ్డారు!

## •వాళ్లలో చాలా మంది మళ్ళీ ఉద్యోగాలు చేస్తున్నారు?

## •"ఏ సి బి" అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుపడిన తర్వాత ఎలా కుర్చీలలో కూర్చుంటున్నారు!

## •ఒక్కసారి జైలుకు వెళ్లిన యువకులు ఉద్యోగాలకు అర్హులు కాదు!

## •ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లినా ఉద్యోగాలకు ఎంపిక చేయరు.

## •అలాంటిది అవినీతి చేసిన ఉద్యోగులు మళ్ళీ ఎలా ఉద్యోగం పొందుతున్నారు!

## •అవినీతి పరులను రాజకీయ నాయకులే ఎందుకు కాపాడుతున్నారు!

## •ఒక్క సారి "ఏసిబి" కి పట్టుబడితే ఉద్యోగం పోవాలి!


- అందుకు అవసరమైన చట్టం చేయాలి!
- పాలకులకు అలాంటి చట్టం చేయడం సాధ్యమా?

## •ఉద్యోగులతో పెట్టుకున్న పార్టీలు మనుగడలో ఉంటాయా?

- అలాంటి చట్టాలు చేయాలంటే మళ్ళీ ఉద్యోగులే రూపకల్పన చేయాలి!
- తమ ఉద్యోగాలను తామే పోగొట్టుకునే పని చట్టాల రూపాకల్పన చేసే అధికారులు సహకరిస్తారా?
- దశబ్దాలుగా అవినీతి నిర్మూలన అనే పదమే వింటున్నాం!
- చట్టం చేయకుండా ఎన్నికల కోసం పార్టీలు చెప్పే మాటలు నమ్ముతున్నాం.
- వీళ్ళు కాక పోతే వాళ్ళు, వాళ్లు కాక పోతే వీళ్ళు చెప్పే సొల్లు విని ఓట్లేస్తున్నాం.
- చందమామ రావే జాబిల్లి రావే అని అమ్మ చెబితే నిజమనుకున్నాం.
- చందమామ రాదని అమ్మకు తెలుసు.. అయినా చెప్పింది.
- అవినీతి నిర్మూలన కూడా అంతే.. రాజకీయ పార్టీలు చెబితే వింటాం!
- అధికారులతో పని కోసం లంచాలు ఇస్తూనే ఉంటాం!

**హైదరాబాద్, నేటిధాత్రి:**

అవినీతి అంతం మా పంతం..ఇది ఎప్పుడు ఎన్నికలు వచ్చినా దేశంలో ఏ పార్టీ నాయకుడైనా, ఆఖరుకు కేంద్రంలో అదికారంలోకి రావాలనుకున్నా చెప్పే ఏకైక వాఖ్యం. అంతే జనం నమ్మాలి. అది ఎన్ని సార్లు చెప్పినా వినాలి. ఎంత మంది చెప్పినా వినాలి. ఎన్నికల నాడు ఆ మాట చెప్పిన పార్టీలకు ఓట్లేయాలి. గెలిపించాలి. ఆ ఐదేళ్ల కాలంలో అవినీతి గురించి పట్టించుకోకపోయినా, మరో పార్టీ చెబితే మళ్లీ వినాలి. ఆ పార్టీని గెలిపించాలి. ఇది నాన్నా పులి కథే. కాని ఎప్పుడూ కంచి చేరని కథే అవినీతి నిర్మూలన. అయితే ఇన్నాళ్ల తర్వాత ఒకే ఒక్కడు. మన ముందు కొత్తగా కనిపిస్తున్నాడు. కొత్త మాట చెప్పాడు. ఆయనే తమిళనాడు సిఎం. విజయ్. ఇప్పటి వరకు ఆ మాట ఏ నాయకుడు చెప్పలేదు. ఏ సిఎం. ప్రకటించలేదు. కనీసం ఈ మాత్రమైనా ప్రజలకు భరోసా కల్పించిన నాయకుడు మరొక్కరు లేరు. సమాజం నుంచి విజయ్ ప్రకటనకు మంచి స్పందన వస్తోంది. అది ఆచరణలో సాద్యమా? కాదా? అనేది కాలం నిర్ణయిస్తుంది. విజయ్ మాట నిలబెట్టుకుంటారా! లేదా? అనేది కొంత కాలం గడిస్తే తేలిపోతుంది. కాని ముందైతే ఒక మాట చెప్పారు. ఎంత వరకు కట్టుబడి వుంటారన్నది కూడా త్వరలోనే తేలుతుంది. కాని పాలకుడిని ఆ మాత్రం మాటైనా చాలు అనుకోవచ్చు. అధికారులకు కాస్తో, కూస్తో భయం పెట్టడానికి కూడా పనికి రావొచ్చు. సమాజం నుంచి స్పందన రావాలని పాలకులు చెబుతుంటారు. పాలకుల నుంచి ప్రతిస్పందన ప్రజలు కోరుకుంటారు. ప్రభుత్వ అదికారులతో పని చేయించుకోవడం మన హక్కు. అని సినిమా డైలాగులు బాగానే వుంటాయి. కాని అవి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా సాద్యమౌతుందా? అవినీతి అంతమౌతుందా? అనేది జనమే ప్రశ్నించుకోవాలంటే సాద్యమయ్యేదికాదు. అవినీతిని అదుపులో పెట్టాలన్నా, అంతం చేయాలన్నా పాలకులే చేయాలి. అంతే కాని జనం నుంచి స్పందన రావాలి. పోరాటం చేయాలంటే సాద్యమయ్యేది కాదు. ఒకే ఒక్కడు, ఠాగూర్, భారతీయుడు లాంటి సినిమాలు తీస్తారు. మనం చూస్తాం. సినిమా నడుస్తున్నంత సేపు వినోదం చూస్తాం. అంతే అంతకు మించి జనం ఏమీ చేయలేరు. తమ పని కోసం అధికారులను ప్రశ్నించలేరు. అసలు పని కోసం పైసా లేకుండా ఆ అధికారి వద్దకు వెళ్లేనేలేం. ఇది మన వ్యవస్థలో వున్న నిజం. కాని దానిని ఒప్పుకోం..అయినా లంచం ఇవ్వకుండా ఊరుకోలేం. ఇది అందరి బలహీనత. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి అవినీతి రహిత పాలన అందిస్తామనే చెబుతున్నారు. కాని ఆ అవినీతి పెరిగి, పెరిగి అనకొండలు, అనంత కొండలంత పెరుగుతోంది. అంతం లేకుండా విస్తరిస్తోంది. పాలకులు తెలియకుండా జరుగుతోందా? పాలకుల ప్రమేయం లేకుండా జరుగుతోందా? అంటే సమాదానం ఎవ్వరూ చెప్పరు. మొత్తం వ్యవస్ధ అవినీతి చీడతో నిండిపోయింది. దానికి అంతం లేదు. ఆ చీడ పోయేది లేదు. కాని మన తృప్తికోసం నాయకులు చెబుతుంటారు. ఆ ఆశతో జనం ఓట్లేస్తుంటారు. అంతే తప్ప అవినీతి అంతం అనేది ఓ బ్రహ్మ పదార్ధం. దానికి ఆది అంతం ఎవరూ చెప్పలేం. ఇచ్చే వారికి, పుచ్చుకునేవారికి కనిపిస్తుంది. అసలు అదికారుల్లో భయం అనేది లేకుండాపోయింది. పట్టుబడుతామన్న భావన లేకుండాపోయింది. పట్టుబడితే పరువు పోతుందన్న ఆలోచనే వారిలో కరువైపోయింది. పోయేది పరువే కదా? సంపాదన దండిగా వుంటే, చేతిలో సొమ్ముంటే పరువు మళ్లీ రెక్కలు కట్టుకొని వాలుతుంది. ప్రజల్లో పలుకుబడి కోసం ఉద్యోగం, అంతస్ధుల కోసం లంచం. రెండూ అధికారులకు కలిసివస్తున్నాయి. లంచం తీసుకోకుండా ఎలా వుంటారు. పట్టుబడినా చింతించాల్సిన అవసరం లేదని దీమాగా వుంటున్నారు. కొలువుపోదు. విరామం తీసుకుంటే వచ్చే నష్టమేమీ లేదు. ఒక్క నెలలో కొన్ని నెలల సంపాదన చేతికొస్తుంది. జీతం కోసం ఆశించే పరిస్దితి లేదు. జీతం రాకపోతే కుటుంబం గడవదన్న దిగులు లేదు. ఒక్క ఏడాదిలో జీతం కాలం సంపాదిస్తున్న ఉద్యోగులు అనేకం వున్నారు. అలాంటి శాఖలను కల్పవృక్షం చేసుకొని సంపాదించుకంటున్నారు. అందుకే పట్టుబడిన ఏ అదికారి ఇళ్లలో సోదాలు చేసిన కోట్లకు కోట్ట కట్టలే కనిపిస్తున్నాయి. వందల కోట్లు ఆస్థులు బైట పడుతున్నాయి. ఇక అలాంటి ఉద్యోగులకు జీతాలెందుకు? రెండు మూడేళ్లు కొలువు లేకపోయినా దిగులెందుకు? ఏ లంచం తీసుకొని కొలువులు పొగొట్టుకుంటున్నారో..అదే లంచం ఇచ్చి మళ్లీ దర్జాగా కొలువుల్లోకి వస్తున్నారు. పైగా ప్రమోషన్లు పొందుతున్నారు. ఇదీ మన వ్యవస్ధ తీరు. పాలకుల పనితీరు. ఒక్కసారి లంచంతో పట్టుబడితే ఉద్యోగం పోతుంది. జీవితాంతం బతుకు జైలుకు అంకితమౌతుందని ప్రభుత్వం కఠినంగా వుంటే లంచం తీసుకునేందుకు ఉద్యోగులు ధైర్యం చేస్తారా? ప్రజల సొమ్ము రూపాయి పట్టుకోవాలంటే వణికిపోకుండా వుంటారా? కాని పాలకులు లంచాలను పెద్ద సమస్యగా చూడడం లేదు. ప్రజలకు ఉద్యోగులతో అవసరం. ప్రజలకు పని చేయించుకోవడం అత్యవసరం అనే విదానం నడుస్తోంది. అవినీతి ఎప్పుడు అంతమొందుతుందని ఆశించే వాళ్లు వున్నా, అవినీతి రూపుమాపడం ఎవరి వల్ల కాదని తెలుసు. కాని తమిళనాడు సిఎం. తీసుకున్న నిర్ణయం ఒక చారిత్రాత్మకమే అని చెప్పాలి. ఒక్క రాష్ట్రం అవినీతిపై కఠినంగా వ్యవహరిస్తే , ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తాయని చెప్పడంలో సందేహం లేదు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్న ఉద్యోగులు మళ్లీ కొలువుల్లో చేరడం అంటేనే అవినీతి నిరోధక శాఖను అపహాస్యం చేసినట్లే.. ఆ వ్యవస్ధ మీద నమ్మకం పోతున్నట్లే. లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిన ఉద్యోగులు మళ్లీ విధుల్లో చేరే పరిస్దితి రావడం అంటేనే వ్యవస్థను వెక్కిరించనట్లే..తమను ఎవరూ ఏంచేయలేరనే ధైర్యం వారిలో పెంపొందినట్లే! అలాంటప్పుడు పట్టుకొని ఏం లాభం? మళ్లీ కొలువులు ఇవ్వడం ఎంత నష్టం! ఒక విద్యార్ధి, నిరుద్యోగి ఉద్యమాల పేరుతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైతే చాలు ఆ వ్యక్తికి జీవితంలో ఉద్యోగం రాదు. ఉద్యమాలు నేరం కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కు. లంచం హక్కు కాదు. నేరం. నేరం చేసిన ఉద్యోగి జైలుకెళ్లి వచ్చి, మళ్లీ దర్జాగా కొలువు చేయడం వ్యవస్థను తలకిందులు చేయడమే అవుతుంది. చిన్న పిల్లలకు తల్లులు అన్నం తినిపించడానికో, నిద్ర పుచ్చడానికి జోల పాట పాడడంలోనో చందమామ రావే..జాబిల్లి రావే అంటూ పాడుతుంది. ఎప్పటికీ చందమామ రాదు. జాబిల్లి మనకు కనీసం దగ్గరగా కనిపించదు. చందమామ రాదని తల్లికి తెలుసు. కాని అవినీతి అంతం పాలకులు తల్చుకుంటే ఆగకుండాపోదు. అవినీతి అంతం కాకుండా వుండదు. పాలకులు ఆ పని చేస్తారా? చేయరు...అవినీతిని అంతం చేస్తామని మాత్రం చెబుతారు. లేకుంటే ఓట్లు పడవు. గెలిచిన పాలకులు కాలేరు. ప్రతిసారి మభ్య పెట్టడం రాజకీయ పార్టీలకు అలవాటు. పదే పదే నమ్మి మోసం పోవడం మనకు రివాజు. ప్రతి పనికి లంచం తీసుకోవడం అదికారులకు అలవాటు. లంచం ఎందుకు ఇవ్వాలి అని ప్రశ్నించలేరు. ప్రశ్నిస్తే పని కాదు. పైగా అదికారులపై దౌర్జన్యం చేస్తున్నారన్న కేసులు తప్ప లంచం ఇచ్చుకోకుండా పనిచేయించుకోవడం సాధ్యం కాదు. ఇదంతా పాలకులకు తెలుసు. మనకూ తెలుసు. తెలిసి జరిగే తప్పును ఎవరూ ఆపలేరు. నిద్రపోయే వాళ్లను తట్టి లేపొచ్చు. కాని నిద్ర నటించేవారిని ఎవరూ మేలు కొలుపలేరు. అది సాధ్యం కూడా కాదు. అవినీతి అంతం కూడా అంతే!! కాదనుకుంటే సమాజం మూర్ఖత్వమంతే!! జనమంతా చేతకానివాళ్లంతే!!!




# ఆమెది కాలేజీలో కాసుల వేట!

# ఆయనది నీళ్లలో జలగల వాట!?

లంచాలకు బంధువులు.. అవినీతికి ఆత్మీయులు!? ఆ ఇద్దరు భార్యభర్తలు దోపిడీకి వారసులు?

## "కేఎంసి" లో ఆమెది అవినీతి చరిత్ర?




నేటిధాత్రి Exclusive

## కాళేశ్వరం అవినీతిలో ఆయనది అంతులేని సంపాదన?

మీ "నేటిధాత్రి"లో ఎక్స్ క్లూసీవ్ గా.. త్వరలో..



నిష్పక్షపాత వార్తల నిజదర్పణం
22ND ANNIVERSARY
# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక



శుక్రవారం 22-05-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 49 రూ॥ 6.00


# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త



●కనీస వేతనాల అమలుకు నిర్ణయం

- ●కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
- ●లబ్ధి పొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- ●బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు
- ●కేటీఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నారన్న భ్రమలో ఉన్నారు
- ●మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నేటిధాత్రి:
కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని, అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్‌కమిటీని నియమించామని అన్నారు.

05 లో



## విదేశీ పర్యటన ముగించుకుని ఢిల్లీకి చేరుకున్న ప్రధాని మోదీ

- ●విదేశీ ప్రతినిధులకు విలువైన కానుకలు అందజేత
- ●కానుకలతో భారతీయత చాటిన మోదీ
- ●ప్రపంచ నేతల చేతుల్లో భారత కళారూపాలు
- ●దౌత్యంతో పాటు సంస్కృతి ముద్ర
- ●బహుమతుల్లో భారత వైభవం

12 లో

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ప్రధాని నరేంద్ర మోదీ ఐదు దేశాల పర్యటనను ముగించుకుని గురువారం భారత్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనల నేపథ్యంలో మోదీ ఆయా దేశాల నేతలకు భారత



## హైబ్రిడ్ విధానంలో టీడీపీ మహానాడు

- ●19 తీర్మానాలకు పొలిట్ బ్యూరో ఆమోదం
- ●టీడీపీ అధినేత చంద్రబాబు వెల్లడి

అమరావతి, నేటిధాత్రి:
హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సమావేశం ముగిసింది. మహానాడు నిర్వహణ ప్రధాన అజెండాగా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు

04 లో

## రూపాయి పతనంపై ఆర్‌బీఐ దిద్దుబాటు

అధికారులతో గవర్నర్ మల్హోత్రా మంతనాలు




ముంబయి, నేటిధాత్రి:
రూపాయి విలువను స్థిరీకరించడానికి, వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను

12 లో

## దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

●సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్ ●రాజీవ్‌కు నివాళి అర్పించిన సీఎం రేవంత్



హైదరాబాద్, నేటిధాత్రి:
దేశం కోసం ప్రాణాలర్పించిన మహానాయకుడు రాజీవ్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.
రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు.
ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు.
"కంప్యూటర్, ఐటీ, టెలికాం రంగాలను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియా గాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది" అని అన్నారు.
మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ

05 లో



## ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

- ●కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి రాక
- ●పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు

కాళేశ్వరం, నేటిధాత్రి:
సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కర స్నానం ఆచరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం

04 లో

## విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23 మందికి చోటు

ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రి యోగం



చెన్నై, నేటిధాత్రి:
తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ తన కేబినెట్‌ను విస్తరించారు. కొత్తగా 23 మంది ఎమ్మెల్యేలు నేడు

04 లో

## పెట్రోల్, గ్యాస్ ధరలు ప్రజలకు అందుబాటులోకి తేవాలి

కేంద్రాన్ని డిమాండ్ చేసిన ఎంపీ వద్దిరాజు



- ●పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో కీలక సూచనలు
- ●వినియోగదారుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యమన్న రాజ్యసభ సభ్యుడు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
క్రూడాయిల్, సహజవాయువు ఉత్పత్తులు, వాటి ధరలు సామాన్య వినియోగదారులకు మరింత అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు

04 లో



## వానకొండయ్య గుట్ట మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలి

- ●జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- ●పుణ్యక్షేత్ర ఉనికి ప్రమాదంలో పడుతోందని ఆందోళన
- ●మైనింగ్ పనులు ఆపకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిక

జనగామ, నేటిధాత్రి:
జనగామ జిల్లా దేవరుప్పుల మండలం లకావత్ తండా

04 లో

## చంద్రబాబు సీఎంగా ఉండటం ఏపీ దురదృష్టం



- ●మావిగన్ పేరు చెబితే మూకుమ్మడి దాడులా
- ●ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు
- ●స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్న బాబు
- ●పెట్రోల్, డీజిల్ కొరతతోనూ ప్రజలకు చంద్రబాబు మోసం
- ●మీడియా సమావేశంలో మండిపడ్డ వైఎస్ జగన్

అమరావతి, నేటిధాత్రి:
చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ చేసుకున్న దురదృష్టమని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. మావిగన్ అంటే బాబుకు గుండె ఆగిపోయేలా ఉందని, చంద్రబాబు నిర్ణయాలతో భవిష్యత్‌లో కూడా రాజధాని లేకుండా చేస్తున్నారని వైఎస్ జగన్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. "చంద్రబాబు కారణంగా ఏపీ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచారు. అమరావతిలో రోడ్లు, నీరు, డ్రైనేజీ, మౌలిక

05 లో

## పాక్‌లోనే పహల్గాం దాడికి పథకం



- ●చార్జిషీట్‌తో బట్టబయలైన ఉగ్ర కుట్ర
- ●పాక్ ప్రమేయంపై ఎన్‌ఐఏ పక్కా ఆధారాలు
- ●ఫోన్ కాల్స్, ఐపీ చిరునామాలతో వెలుగులోకి నిజాలు
- ●పహల్గాం దాడి వెనుక పాక్ హస్తం
- ●ఉగ్రవాదుల మొబైళ్లు పాక్‌లోనే కొనుగోలు
- ●టీఆర్ఎఫ్ పాత్రపై దర్యాప్తులో కీలక అంశాలు
- ●సూత్రధారిగా సైపుల్లా పేరు వెల్లడి
- ●పాక్ వాదనలను తిప్పికొట్టిన దర్యాప్తు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) దాఖలు చేసిన చార్జిషీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఉగ్రదాడికి సంబంధించిన వ్యూహరచన, పథకం అమలు అంతా పాకిస్థాన్ కేంద్రంగానే సాగిందనే విషయాన్ని బలమైన ఆధారాలతో ఎన్‌ఐఏ వెల్లడించింది.
ఈ ఘటన జరిగిన వెంటనే ఈ దాడికి తామే బాధ్యులమంటూ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించింది. ఈ దాడికి వ్యూహరచన నుంచి టీఆర్ఎఫ్ చేసిన ప్రకటన వరకు అన్నీ పాకిస్థాన్‌లోనే జరిగాయని ఎన్‌ఐఏ వివరించింది.

12 లో

## ఉద్యమం తప్పదు

జూన్ 2 లోగా ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



- ●జూన్ లోనే ప్రైవేట్ స్కూల్స్ ఫీజు దోపిడీ నియంత్రణకు చట్టం చేయాలి
- ●సన్న వడ్లకు బోనస్ ఎగ్గొట్టేందుకు గ్రేడ్ బీ అంటూ మోసం చేస్తున్న కర్కోటక సర్కార్ ఇది
- ●వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి, సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలి
- ●కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- ●కుత్బుల్లాపూర్ లో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ. పార్టీ లోకి భారీగా చేరికలు

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ అమరవీరులకు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు జూన్ 2 లోగా

04 లో



## సభ్యత్వ నమోదు-బూత్ స్థాయి బలోపేతంపై బీఆర్ఎస్ ఫోకస్

- ●ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్
- ●డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు చేపట్టనున్న పార్టీ
- ●ప్రతి అర్హ ఓటరుకు న్యాయం జరిగేలా అప్రమత్తంగా ఉండాలని పిలుపు

04 లో

## కొనుగోలు కేంద్రాల్లో మరణమృదంగం

రైతులు పిట్టల్లా రాలుతున్నా ధాన్యం కొనరా



- ●ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడండి సీఎం గారు
- ●23న జరిగే కేబినెట్ భేటీలో అయినా చర్చించండి
- ●సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

05 లో



22ND ANNIVERSARY

నేటిధాత్రి ®

తెలుగు వార్త పత్రిక



శుక్రవారం 22-05-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 49 రూ॥ 6.00


# అక్షర ప్రగతి పథంలో

# నేటిధాత్రి




పదునైన అక్షరం, చైతన్యవంతమైన భావం ఈ సమాజానికి అవసరమని, కలం, కాగితం చేత పట్టుకొని **"నేటిధాత్రి"** పత్రిక ప్రయాణం ప్రారంభించి **"22 వసంతాలు".**

తెలంగాణా ఉద్యమాన్ని తన భుజాల మీద మోస్తూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ముందుకు సాగుతోంది. ఉద్యమం కోసం **"నేటిధాత్రి"** తనకు తాను సర్వస్వం త్యాగం చేసింది.

తెలంగాణా కోసం, ఆత్మ గౌరవం కోసం, తెలంగాణ ఆస్తిత్వం కోసం **"నేటిధాత్రి"** అక్షర పోరాటం ముందుండి చేసింది. ఇప్పుడు తెలంగాణ వికాసం కోసం సాగుతోంది. ప్రజా గొంతుకై నిటారుగా నిలబడుతోంది.

అందుకు **"నేటిధాత్రి"** కోసం ఎందరో **ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు, సన్నిహితులు, సమాజ సేవకులు, మేధావులు, వ్యాపారులు, అధికారులు** ఇలా అన్ని రంగాలకు చెందిన సేవాతత్పరులు చేయూతనందిస్తూ వచ్చారు. వాళ్లందరికీ అక్షరాభివందనాలు, కృతజ్ఞతలు.

ఈ మీ సహకారం ఎల్లప్పుడూ ఉండాలని **"నేటిధాత్రి"** పత్రిక **22 వసంతాల** సందర్భంగా మీ అందరి సహాయ, సహకారాలతో మరింత ముందుకు సాగేలా ఆశీర్వదించాలని...

**అక్షర వేడుకతో...**



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
CEO, నేటిధాత్రి9 TV
డైరెక్టర్, ధాత్రి గ్రూప్స్

మీ
**కట్టా రాఘవేందర్ రావు**
చీఫ్ ఎడిటర్ - నేటిధాత్రి
CEO, ధాత్రి గ్రూప్స్

# ఉద్యమం తప్పదు

**జూన్ 2 లోగా ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి**





హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ అమరవీరులకు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు జూన్ 2 లోగా నెరవేర్చకపోతే మరో ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ప్రైవేట్ విద్య సంస్థల ఫీజు దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీలో చేరికల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మైనార్టీ నేత అహ్మద్ తో పాటు పెద్ద ఎత్తున ఆయన అనుచరులు టీఆర్ఎస్ లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కవిత. ఈ సందర్భంగా మాట్లాడారు. కుత్బుల్లాపూర్ నుంచే టీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలవుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చాక తామిచ్చిన పాంచజన్యం హామీలను అమలు చేస్తామన్నారు. కుత్బుల్లాపూర్ లో 20 ఏళ్ల క్రితం నిర్మించిన అమరుల స్థూపాన్ని జూన్ 2 లోగా ఆవిష్కరించాలని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. లేదంటే టీఆర్ఎస్ ఆధ్వర్యంలో అమరుల స్థూపాన్ని తామే ఆవిష్కరిస్తామని హెచ్చరించారు.

### జూన్ లో లోగా హామీలు అమలు చేయాలి

తెలంగాణ ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను జూన్ 2, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం లోగా నెరవేర్చాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయటం చేతకాక కేకే కమిటీ పేరుతో కాలయాపన చేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టిందని ఆమె మండిపడ్డారు. జూన్ 2 రోజు జెండా ఎగురవేసే కార్యక్రమం సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించాలని అల్టిమేటం జారీ చేశారు. లేదంటే ఈ ప్రభుత్వం మీద మరో ఉద్యమం తప్పదని కవిత హెచ్చరించారు. ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల దోపిడీ మీద కూడా ప్రభుత్వం వెంటనే చట్టం చేయాలని కోరారు. ఇప్పటికే ఈ అంశంపై పలుమార్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఫీజు దోపిడీ నియంత్రణ జరగాలంటే జూన్ లో కచ్చితంగా ఫీజు నియంత్రణ చట్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### కుత్బుల్లాపూర్ నుంచే జైత్రయాత్ర

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ స్థానాన్ని దక్కించుకుంటామని కవిత ధీమా వ్యక్తం చేశారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో తమ అభ్యర్థులు పోటీ లో ఉంటారని చెప్పారు. కుత్బుల్లాపూర్ లో మొట్ట మొదటగా జెండా ఎగురవేసుకున్నట్లే ఇక్కడి నుంచే తొలి ఎమ్మెల్యే ను గెలిచుకొని జైత్రయాత్ర ప్రారంభిస్తామన్నారు. ఈ నియోజకవర్గంలో 20 ఏళ్ల క్రితమే నిర్మించిన అమరుల స్థూపాన్ని ఇప్పటికీ కూడా ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ పార్టీ అని చెప్పుకునే పార్టీని గెలిపించినప్పటికీ అమరుల స్థూపాన్ని ఆవిష్కరించలేదని చెప్పారు. జూన్ 2 లోగా ప్రభుత్వం అమరుల స్థూపాన్ని ఆవిష్కరించాలని కవిత డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో తామే స్థూపాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు.

### అన్ని వర్గాలు ప్రతిబింబిచేలా జెండా రూపకల్పన

తెలంగాణ రక్షణ సేన జెండాలోని పసుపు రంగు సౌభాగ్యానికి సూచిక అని కవిత చెప్పారు. పసుపంటే మన తంగేడు పువ్వు అని గుర్తు చేశారు. ఆదివాసీ, బీసీ లను సూచించేది పసుపు అని చెప్పారు. జెండాలోని మరొక రంగు నీలిరంగు అన్నారు. నీలి రంగు అంటే కూలీ, నాలీ చేసే కార్మికులు,ఎస్సీ, ఎస్టీ, ఆడబిడ్డలని చెప్పారు. ఇక పచ్చ రంగు పర్యావరణానికి సూచిక అని చెప్పారు. మైనార్టీలను కూడా పచ్చ రంగు సూచిస్తుందన్నారు. అన్ని వర్గాలను ప్రతిబింబిచేలా తెలంగాణ రక్షణ సేన జెండాను రూపొందించామన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల రక్షణ కోసం పుట్టిన పార్టీయే తెలంగాణ రక్షణ సేన అని చెప్పారు. ఈ ప్రాంతం దుఖం పోయేందుకు టీఆర్ఎస్ కార్యకర్తలంతా సైనికుల మాదిరిగా పోరాడాలని సూచించారు.

### పాంచజన్యం అమలు చేస్తాం

తెలంగాణలో విద్య, వైద్యం కోసం చేస్తున్న ఖర్చు కారణంగా ప్రజల ఇళ్లు గుల్ల అవుతున్న పరిస్థితి ఉందన్నారు. ప్రజలకు మంచి చేయాలంటే కార్పొరేట్ స్థాయి వైద్యం, విద్యను పూర్తిగా ఉచితంగా అందించాల్సి ఉందన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం విషయంలో ప్రజలపై పైసా భారం పడనివ్వమని కవిత చెప్పారు. రైతులను ఈ దుర్మార్గపు, కర్కోటక ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఒక్క రైతు కూడా సంతోషంగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవటంతోనే ధాన్యం కుప్పలపై రైతులు చనిపోతున్న పరిస్థితి ఉందన్నారు. సన్న వడ్లకు బోనస్ ఎగ్గొట్టేందుకు గ్రేడ్ బీ అంటూ రాస్తున్నారని కవిత మండిపడ్డారు. రైతుల పక్షాన తాము పోరాడుతామని భరోసా ఇచ్చారు. యువతకు 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు వారు వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇస్తామని చెప్పారు. రాష్ట్ర యువతపై నమ్మకం ఉంచి వారి కలలను సాకారం చేసేందుకు తాము ప్రోత్సహం అందిస్తామన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు అన్ని వర్గాలకు న్యాయం చేసేలా పోరాటం చేస్తామని చెప్పారు. నేను మీ బిడ్డను మీకు ఏం కావాలో నాకు తెలుసు అంటూ ప్రజలను ఉద్దేశించి కవిత వ్యాఖ్యనించారు.

# పెట్రోల్, గ్యాస్ ధరలు ప్రజలకు అందుబాటులోకి తేవాలి

**•వినియోగదారుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యమన్న రాజ్యసభ సభ్యుడు**



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
క్రూడాయిల్, సహజవాయువు ఉత్పత్తులు, వాటి ధరలు సామాన్య వినియోగదారులకు మరింత అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యుడిగా కొనసాగుతున్న ఎంపీ రవిచంద్ర ఇందుకు సంబంధించి గురువారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్ ప్రాంగణంలోని అనెక్స్ భవనంలో స్థాయీ సంఘం చైర్మన్ తట్కారే సునీల్ దత్తాత్రే అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో ఈ సమీక్షా సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.
ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన సేవలను అందించడమే ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ తదితర ఉత్పత్తుల కొరత కారణంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో తాను వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి తెలుగు రాష్ట్రాల్లో సరఫరాను మెరుగుపరిచినట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తరచూ పెరగడం వల్ల రవాణా చార్జీలు, నిత్యావసర వస్తువులు, పండ్లు, కూరగాయల ధరలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఎంపీ రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ నిల్వలు, దిగుమతులు, రవాణా, సరఫరా వ్యవస్థలో వ్యర్థం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన పర్యవేక్షణ అవసరమని సూచించారు. అదేవిధంగా ఇంధన ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరగకుండా సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థ అవసరమని పేర్కొంటూ పలు సూచనలు, సలహాలు అందించారు.

# వానకొండయ్య గుట్ట మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలి


**•జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



జనగామ, నేటిధాత్రి:
జనగామ జిల్లా దేవరుప్పుల మండలం లకావత్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వానకొండయ్య లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం మైనింగ్ మాఫియా కారణంగా ఉనికి కోల్పోయే ప్రమాదంలో పడిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను దేవరుప్పుల మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి కలిసి మెమోరాండం అందజేశారు. గుట్టపై కొనసాగుతున్న మైనింగ్ పనులకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని కోరారు.
వానకొండయ్య గుట్ట వద్ద మైనింగ్ కార్యకలాపాలు కొనసాగితే ఆలయ ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ అంశాన్ని అప్పటి ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి మైనింగ్ అనుమతులు రద్దు చేయించామని, దేవస్థానం మనుగడను కాపాడేందుకు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేశారు.
అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా మళ్లీ మైనింగ్ పనులు ప్రారంభమయ్యాయని విమర్శించారు. మైనింగ్ పనులను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు గుట్ట వద్దకు వెళ్తే తమ నాయకులపై కేసులు నమోదు చేసి, నోటీసులు జారీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఏ పరిస్థితుల్లోనైనా వానకొండయ్య గుట్ట వద్ద మైనింగ్ పనులను ఆపాలని, లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఇదే సందర్భంగా పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం త్వరితగతిన కొనుగోలు చేయాలని కోరారు. అలాగే మాదాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న 30 డబుల్ బెడ్‌రూం ఇళ్ల మూడో విడత బిల్లులను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వివాహితను గొంతుకోసి దారుణ హత్య





సుమలత ఫైల్ ఫొటో..

- ●లక్ష్మీపురం శివారులో గొంతు కోసి చంపిన దుండగులు
- ●ఉపాధి హామీ కూలీల సమాచారంతో వెలుగులోకి వచ్చిన ఘటన
- ●మృతురాలు తాళ్లపెల్లి సుమలతగా గుర్తింపు.. పోలీసుల దర్యాప్తు

**దుగ్గొండి, నేటిధాత్రి:**
దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం గ్రామ శివారులో గురువారం ఉదయం ఒక దారుణమైన ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని దుండగులు ఒక వివాహితను అత్యంత కిరాతకంగా గొంతు కోసి హత్య చేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ఓ నేపథ్యంలో మృతురాలిని లక్ష్మీపురం గ్రామానికి చెందిన తాళ్లపెల్లి సుమలతగా పోలీసులు గుర్తించారు. లక్ష్మీపురం -- ఏల్కుర్తి గ్రామాల మధ్య ఉన్న కెనాల్ సమీపంలో ఈ ఘాతుకం జరిగింది. గురువారం ఉదయాన్నే ఉపాధి హామీ పనుల నిమిత్తం వెళ్తున్న ఏలుకుర్తి గ్రామస్తులకు రక్తపు మడుగులో పడి ఉన్న సుమలత మృతదేహం కనిపించింది. దీంతో వారు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.

### క్లూస్ టీమ్‌తో ఆధారాల సేకరణ..

స్థానికులు,ఎస్సై రావుల రణధీర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తాళ్ళపెల్లి సుమలత భర్త గత నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు.ఇద్దరు పిల్లలతో జీవనం కొనసాగిస్తున్నది.బుధవారం సుమలత సరుకులు కొనుగోలు చేయడానికి వరంగల్ వెళ్ళింది.రాత్రి ఐనప్పటికీ ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇండ్లల్లో తెలుసుకున్నారు.గురువారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్ళే వారు కెనాల్ వద్ద శవమై కనిపించడంతో పోలీసులు,గ్రామస్తులకు సమాచారం అందజేశారు.హత్య సమాచారం అందుకున్న వెంటనే దుగ్గొండి ఎస్సై రణధీర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, క్లూస్ టీమ్ సహాయంతో అక్కడి ఆధారాలను సేకరిస్తున్నారు. సుమలతను ఎవరు హత్య చేశారు? హత్యకు గల కారణాలు ఏంటి? అనే కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఊరి వెలుపల వివాహిత దారుణ హత్యకు గురికావడంతో లక్ష్మీపురం గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలు, విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన పట్ల దుగ్గొండి సీఐ సాయి రమణ, ఎస్సై రణధీర్ రెడ్డి దర్యాప్తు చేపట్టారు. హత్యకు గురైన సుమలత తండ్రి చిలువేరు కట్టయ్య ఫిర్యాదు మేరకు శవ పంచాంగం అనంతరం పోస్టుమార్టం తరలించినట్లు తెలిపారు. హత్యకు గల కారణాల పట్ల పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రణధీర్ రెడ్డి పేర్కొన్నారు.

### ఐదేండ్ల క్రితం భర్త మృతి..

తాళ్లపెల్లి సుమలత భర్త గత నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో వారి పిల్లలు చిన్నవాళ్ళు కావడంతో సుమలతే అన్ని తానై పోషిస్తున్నది. సుమలత దారుణ హత్యకు గురికావడంతో 11 సంవత్సరాల కుమారుడు, 8 సంవత్సరాల కూతురు అనాధలుగా మిగిలారు.

# విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23 మందికి చోటు

**ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రి యోగం**

చెన్నై, నేటిధాత్రి:
తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ తన కేబినెట్‌ను విస్తరించారు. కొత్తగా 23 మంది ఎమ్మెల్యేలు నేడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. 21 మంది టీవీకే ఎమ్మెల్యేలతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు దక్కింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, తనకు మద్దతిచ్చిన కాంగ్రెస్‌తో పాటు ఐయూఎంఎల్, వీసీకే పార్టీలకు కూడా సీఎం విజయ్ కేబినెట్ బెర్త్ ఆఫర్ చేశారు. అయితే, మరికొంతకాలం తర్వాత ఐయూఎంఎల్, వీసీకేలు కేబినెట్‌లో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సీపీఐ, సీపీఎంలను కూడా సీఎం విజయ్ మంత్రివర్గంలోకి ఆహ్వానించినట్లు మంత్రి ఆధవ్ అర్జున తెలిపారు. వీసీకే చీఫ్ తోల్ తిరుమావళవన్ మంత్రివర్గంలో చేరాలని తాము ఆశిస్తున్నట్లు కూడా పేర్కొన్నారు. మే 10న జరిగిన ప్రమాణస్వీకారంలో విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఇక తమిళనాడు కేబినెట్‌లో గరిష్ఠంగా 35 మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా 23 ఎమ్మెల్యేలు మంత్రులుగా చేరడంతో మంత్రివర్గం సంఖ్య 32కు చేరింది. దీంతో మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉంది.

# బక్రీద్ సెలవు 27న కాదు... 28కి మార్పు



అమరావతి, నేటిధాత్రి:
ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండుగ సెలవు దినాన్ని మారుస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా ప్రకటించిన మే 27న కాకుండా మే 28వ తేదీన ఈ బక్రీద్ సెలవు దినంగా ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఈ మార్పు వర్తిస్తుందని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.
గతంలో ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన వార్షిక క్యాలెండర్ ప్రకారం మే 27వ తేదీ బక్రీద్ సెలవుగా ప్రకటించారు. అయితే చంద్రదర్శనం ఆధారంగా పండుగ తేదీ మారింది. దాంతో సెలవు రోజును కూడా మార్చాలని ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
వక్ఫ్ బోర్డు సీఈవో చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పరిశీలించింది. అనంతరం సెలవును మే 28కు మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

# సభ్యత్వ నమోదు-బూత్ స్థాయి బలోపేతంపై బీఆర్ఎస్ ఫోకస్



హన్మకొండ, నేటిధాత్రి:
హన్మకొండ అడ్వకేట్స్ కాలనీలోని జనగాం నియోజకవర్గ శాసనసభ్యులు, జనగాం-హన్మకొండ-వరంగల్ జిల్లాల బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి పల్లా రాజేశ్వర్ రెడ్డి నివాసంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమీక్ష సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో జరగబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ముఖ్య నాయకులతో చర్చించి, క్షేత్రస్థాయిలో పార్టీ ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలపై పలు సూచనలు చేసినట్లు తెలిపారు.
ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నందున పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.
ఒకవైపు సభ్యత్వ నమోదు కార్యక్రమం, మరోవైపు కమిటీల నిర్మాణం
పూర్తి చేసిన అనంతరం ప్రతి బూత్ లెవల్ కమిటీకి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ బలోపేతం, ఓటరు జాబితా పరిరక్షణలో బూత్ స్థాయి కమిటీల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు.
బీఎల్ఏల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఓటరు జాబితాను పరిశీలించడం, కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టడం, తప్పులు, డూప్లికేట్ పేర్లను గుర్తించడం, ఓటర్ల వివరాలను సరిచేయించేందుకు సహకరించడం వంటి అంశాలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు.
అలాగే ఎన్నికల సంఘం నిర్వహించే ప్రత్యేక సర్వేలు, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. ప్రస్తుతం రాజకీయ పార్టీల్లో నిర్వహిస్తున్న బీఎల్ఏ శిక్షణ కార్యక్రమం అనేది బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలకు ఓటరు జాబితా నిర్వహణపై అవగాహన కల్పించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమమని వివరించారు. అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించి, ప్రతి అర్హుడైన ఓటరుకు న్యాయం జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

**•కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి రాక** **•పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు**



కాళేశ్వరం, నేటిధాత్రి:
సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కర స్నానం ఆచరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు ఏర్పాటు చేశారు.
సరస్వతీ ఘాట్‌తో పాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు 300కు పైగా తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు నిర్ణయించారు.
జూన్ 1 వరకు ప్రతిరోజూ సాయంత్రం హారతి కార్యక్రమం నిర్వహించనున్నారు. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చే అవకాశముందని అధికారులు తెలిపారు.
ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహినిగా సరస్వతి నది ప్రవహించే ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్న ప్రదేశాలు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండవది కాళేశ్వరం మాత్రమే. అక్కడ కుంభమేళా నిర్వహించడం ఆనవాయితీ. తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం విశేషం.
ఆది పుష్కరాల్లో నదీస్నానం ఆచరించడం, పితృతర్పణాలు చేయడం వల్ల కలిగే ఫలితాలే అంత్య పుష్కర సమయంలో కూడా లభిస్తాయని పండితులు పేర్కొంటున్నారు.

# హైబ్రిడ్ విధానంలో టీడీపీ మహానాడు

**●19 తీర్మానాలకు పొలిట్ బ్యూరో ఆమోదం ●టీడీపీ అధినేత చంద్రబాబు వెల్లడి**




అమరావతి, నేటిధాత్రి:
హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సమావేశం ముగిసింది. మహానాడు నిర్వహణ ప్రధాన అజెండాగా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కార్యకర్తే అధినేత అనే భావన మహానాడు వేదికగా వినిపించాలన్నారు. మహిళలకు తెలుగుదేశం పార్టీ ఇస్తున్న ప్రాధాన్యం అందరికీ అర్థమయ్యేలా చాటాలని సూచించారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలు పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారని పేర్కొన్నారు. వారి అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందనే సందేశం వెళ్లాలని అన్నారు. మహానాడులో ప్రవేశపెట్టే 19 తీర్మానాలకు పొలిట్‌బ్యూరో ఆమోదం తెలిపిందని వెల్లడించారు. సమయపాలన పాటిస్తూ ప్రతి అంశాన్ని స్పష్టంగా వివరించాలని నేతలకు సూచించారు.

# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

●కనీస వేతనాల అమలుకు నిర్ణయం



●కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
●లబ్ది పొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
●బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు
●కేటీఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నారన్న భ్రమలో ఉన్నారు
●మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నేటిధాత్రి:
కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని, అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్‌కమిటీని నియమించామని అన్నారు. సబ్‌కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీస వేతనాలు నిర్ణయించాం" అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచామని తెలిపారు. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు, స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు, హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు.
రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసిందని, తమ ప్రభుత్వం బాధ్యతతో కార్మికుల ప్రయోజనాల కోసం నిర్ణయం తీసుకుందని అన్నారు. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తుకొస్తారని, ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.
యువతకు ఒక సూచన చేస్తున్నానని సీఎం అన్నారు. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడాలని, ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థమని వ్యాఖ్యానించారు. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ వంటి దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోందని, ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు.
ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాలను బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోందని ఆరోపించారు. అందుకే ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతున్నారని అన్నారు. తమ ప్రభుత్వం ప్రతి అంశాన్ని దీర్ఘకాలిక దృష్టితో పరిశీలిస్తోందని, అందుకే కార్మికుల కనీస వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.
రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయిందని, ఇంకా 20 శాతం మిగిలి ఉందని తెలిపారు. ఆ ప్రక్రియ కూడా త్వరలో పూర్తవుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారని, రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరించడం సరికాదన్నారు. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు.
పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారమని వ్యాఖ్యానించారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలని, కానీ దిగజారి ప్రవర్తించవద్దని సూచించారు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసులు ఇచ్చి విచారణ చేశామని, బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నామని తెలిపారు. పోక్సో కేసులో పోలీసులు విధి విధానాల ప్రకారమే వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట్ల రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయ్యిందన్నారు. పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్ రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగినా ఎందుకు బయటకు రాలేదని ప్రశ్నించారు.
కులగణన విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచామని చెప్పారు. "జనగణనలో కులగణన" విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణనను చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

## లోన్ రికవరీ ఆగడాలకు కళ్లెం

●కొత్త నిబంధనలు ప్రతిపాదించిన ఆర్‌బీఐ
●కస్టమర్లను వేధించే చర్యలపై కఠిన ఆంక్షలు




న్యూఢిల్లీ, నేటిధాత్రి:
రుణాలు తిరిగి చెల్లించని సందర్భంలో వాటిని వసూలు చేసే విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. లోన్ల రికవరీ పేరుతో కస్టమర్లను వేధించే బ్యాంకులకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన నిబంధనలను ప్రతిపాదించింది.
ఈ మేరకు 'కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటిటీస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్' పేరిట ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించింది. దీనిపై మే 31 వరకు వాటాదారులు, ప్రజల అభిప్రాయాలను సేకరించనుంది. అక్టోబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమలు చేయనుంది.
వ్యక్తిగత, కారు, హోమ్ లోన్ విషయంలో రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లింపులు చేయనప్పుడు మొబైల్‌ఫోన్‌ను లాక్ చేయడం, దాని ఫీచర్లను నిలిపివేయడం వంటివి బ్యాంకులు చేయకూడదని పేర్కొంది. ఒకవేళ ఆ మొబైల్ ఫోన్ లేదా టాబ్లెట్‌ను కొనుగోలు చేయడానికి సదరు బ్యాంకే లోన్ ఇచ్చి ఉంటే, అప్పుడు మాత్రమే ఫోన్ ఫీచర్లను నిలిపివేసే హక్కు బ్యాంకుకు ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.
అది కూడా సదరు లోన్ బకాయి పడి 90 రోజుల గడువు దాటి ఉండాలి. కస్టమర్లకు నోటీసులు ఇచ్చినా స్పందించని సందర్భాల్లోనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఫోన్ బ్లాక్ చేసినప్పటికీ ఇంటర్నెట్, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ ఎమర్జెన్సీ అలర్టులు నిలిపివేయకూడదని పేర్కొంది.
ఒకవేళ కస్టమర్ తన బకాయిని చెల్లిస్తే గంటలోనే ఫోన్‌పై ఉన్న ఆంక్షలు తొలగించాలి. ఆలస్యమైతే గంటకు రూ.250 చొప్పున బ్యాంకే తిరిగి రుణగ్రహీతకు పరిహారంగా చెల్లించాల్సి ఉంటుంది.
లోన్ రికవరీ కోసం బ్యాంకు ఉద్యోగులు లేదా రికవరీ ఏజెంట్లు చేసే అన్ని కాల్స్ సమయం, నంబర్లను రికార్డు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. అలాగే వారు చేసే ఆడియో, టెక్స్ట్ సంభాషణలను భద్రపరచాలని బ్యాంకులకు సూచించింది. రుణాల వసూళ్లలో లోన్ ఏజెంట్లు లేదా ఉద్యోగులు అసభ్య పదజాలం, బెదిరింపులకు దిగడం వంటివి చేయకూడదని స్పష్టం చేసింది. కస్టమర్ల వ్యక్తిగత వివరాలు, ఆడియో, వీడియో రికార్డులను సోషల్ మీడియాలో పెట్టడం, సామాజిక మాధ్యమాల ద్వారా అసభ్యకర సందేశాలు పంపడం, కాల్స్ చేసి పదేపదే వేధించడం వంటివి చేయకూడదని ఆర్‌బీఐ ప్రతిపాదించింది.

## దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత



హైదరాబాద్, నేటిధాత్రి:
దేశం కోసం ప్రాణాలర్పించిన మహానాయకుడు రాజీవ్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. "కంప్యూటర్, ఐటీ, టెలికాం రంగాలను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియా గాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది" అని అన్నారు.
మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ ప్రభుత్వం కుయుక్తులు పన్నిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారని విమర్శించారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన నాయకుడు రాజీవ్ అని పేర్కొన్నారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.
33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సీఎంగా ఉండటం ఏపీ దురదృష్టం

●మావిగన్ పేరు చెబితే మూకుమ్మడి దాడులా
●ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు
●స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్న బాబు
●పెట్రోల్, డీజిల్ కొరతతోనూ ప్రజలకు చంద్రబాబు మోసం
●మీడియా సమావేశంలో మండిపడ్డ వైఎస్ జగన్



అమరావతి, నేటిధాత్రి:
చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ చేసుకున్న దురదృష్టమని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. మావిగన్ అంటే బాబుకు గుండె ఆగిపోయేలా ఉందని, చంద్రబాబు నిర్ణయాలతో భవిష్యత్‌లో కూడా రాజధాని లేకుండా చేస్తున్నారని వైఎస్ జగన్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. "చంద్రబాబు కారణంగా ఏపీ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచారు. అమరావతిలో రోడ్లు, నీరు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాలకే రూ.2 లక్షల కోట్లు ఖర్చవుతుంది. ఆచరణ సాధ్యం కాదని తెలిసినా అమరావతిపై ముందుకు వెళ్తున్నారు. స్కామ్‌ల కోసమే చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు చేశారు. ఖజానా నుంచి రూ.9,200 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారు. ప్రశ్నిస్తే చంద్రబాబుకు బీపీ పెరుగుతోంది. రాష్ట్రానికి రాజధాని ఉండాలనే మావిగన్‌ను ప్రతిపాదించాం. రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా మావిగన్‌ను ప్రత్యామ్నాయంగా చూపించాం" అన్నారు. అమరావతి అయితే జీరో నుంచి మొదలుపెట్టాలని, చంద్రబాబు స్కామ్‌ల కోసం ఏపీని ఇబ్బంది పెడుతున్నారని జగన్ విమర్శించారు. ప్రజలు కూడా మావిగన్‌కు మద్దతు పలికారన్నారు. అది తట్టుకోలేక చంద్రబాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, మంత్రులతో కూడా బూతులు మాట్లాడిస్తున్నారని ఆరోపించారు.
రూ.1,200 కోట్లతో అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం ఉన్నా మళ్లీ అన్నీ కొత్తగా కడతానంటున్నారని అన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఐదు భవనాల నిర్మాణం పేరుతో చంద్రబాబు దోపిడీ చూస్తే ప్రజలు నివ్వెరపోతున్నారని విమర్శించారు. భవన డిజైన్లకే రూ.401 కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఈ ఐదు భవనాలకు అయ్యే మొత్తం ఖర్చు రూ.10,665 కోట్లు అని, ప్రస్తుతం చదరపు అడుగుకు రూ.20,427 అవుతుందని పేర్కొన్నారు. వాటి ఫర్నీచర్, ఇంటీరియర్, ఇతర అదనపు ఖర్చులతో చదరపు అడుగుకు రూ.30 వేలు దాటుతుందని ఆరోపించారు.
మళ్లీ ఇదే నిర్మాణాలకు కొత్త టెండర్లు పిలిచినా పాతవాళ్లకే ఇచ్చారని విమర్శించారు. ఫైవ్‌స్టార్ హోటళ్లకు కూడా చదరపు అడుగు రూ.4,500 లోపే ఉంటుందని, తెలంగాణలో రూ.615 కోట్లతో కేసీఆర్ సచివాలయం నిర్మించారని, మన సచివాలయానికి మాత్రం ఇంత ఖర్చు ఎందుకని ప్రశ్నించారు. కొత్త అసెంబ్లీ, కొత్త హైకోర్టు అంటూ మళ్లీ భారీగా ఖర్చు చేయబోతున్నారని, ఇదంతా విచ్చలవిడిగా జరుగుతున్న దోపిడీయేనని పేర్కొన్నారు.
ప్రతిపక్ష పార్టీగా గత రెండేళ్లుగా తాము ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నిస్తున్నామని జగన్ తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌తో పాటు మొత్తం 143 హామీల అమలు గురించి ప్రజలు కూడా సమాధానం కోరుతున్నారని అన్నారు.
పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోలేదని జగన్ విమర్శించారు. 2014-19 మధ్య కాలంలో కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితులు లేకపోయినా, 2015 ఫిబ్రవరిలో లీటర్‌కు రూ.4 చొప్పున పెట్రోలు, డీజిల్‌పై అదనపు భారం మోపారని గుర్తు చేశారు. అయితే తమ ప్రభుత్వ హయాంలో కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులు ఉన్నప్పటికీ, చంద్రబాబు పెంచిన దానికంటే కేవలం ఒక్క రూపాయి మాత్రమే అదనంగా పెంచామని జగన్ పేర్కొన్నారు. ఆ సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ తీవ్ర విమర్శలు చేశారని అన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే పెట్రోలు, డీజిల్‌పై ఉన్న పన్నులను తగ్గించి ధరలు తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని జగన్ గుర్తు చేశారు. అదే విషయాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరిచారని అన్నారు. ప్రస్తుతం పెట్రోలు, డీజిల్‌పై ఇప్పటికే రూ.4 వరకు అదనపు భారం పెరిగిందని ఆరోపించిన జగన్, చంద్రబాబు గతంలో చెప్పిన మాటల ప్రకారం ఇప్పుడు లీటర్‌కు కనీసం రూ.8 తగ్గించాలి కదా అని ప్రశ్నించారు.
రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన పెట్రోలు, డీజిల్ కొరతపై కూడా జగన్ తీవ్ర విమర్శలు చేశారు. ఏప్రిల్ చివరి వారంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెట్రోలు బంకుల వద్ద బారులు తీరారని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల అవసరాలు తీర్చాల్సిన ముఖ్యమంత్రి, అమరావతి కాంట్రాక్టర్లకు రిటైల్ అవుట్‌లెట్ల నుంచి పెట్రోలు, డీజిల్ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాయడం దారుణమని జగన్ వ్యాఖ్యానించారు. బల్క్‌లో డీజిల్ కొనుగోలు చేస్తే ధర రూ.150 పైగా ఉంటుందని, కానీ రిటైల్ ధర రూ.101 మాత్రమే ఉండటంతో కొందరికి లాభం చేకూర్చే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించిందని జగన్ తెలిపారు. రిటైల్ అవుట్‌లెట్ల నుంచి కమర్షియల్ అవసరాలకు ఇంధనం వాడకూడదని కేంద్రం స్పష్టం చేస్తూ రాష్ట్రానికి లేఖ రాసిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై స్పందించకుండా సంక్షోభ సమయంలో కూడా స్కామ్‌లకు పాల్పడుతున్నారని ప్రభుత్వంపై జగన్ విమర్శలు గుప్పించారు.

## కొనుగోలు కేంద్రాల్లో మరణమృదంగం

●రైతులు పిట్టల్లా రాలుతున్నా ధాన్యం కొనరా
●సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్, నేటిధాత్రి:
పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లు మొద్దునిద్ర ముఖ్యమంత్రి గారూ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి అని హితవు పలికారు. రైతుల ప్రాణాలు పోతున్నా పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని మండిపడ్డారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.
కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణమృదంగం ఏమిటని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదని అన్నారు. ఇవాళ బూతులు తిడుతున్న రైతులే రేపు వాతలు పెడతారని హెచ్చరించారు. కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్‌డౌన్ మొదలైందని అన్నారు.
రైతుకు రక్షణగా కేసీఆర్ అమలు చేసిన ఒక్కో పథకానికి గత రెండున్నరేళ్లుగా పాతరేసిన మీరు, మీ చేతకానితనంతో అన్నదాత వెన్నువిరిచారని విమర్శించారు. ఇవాళ మీ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయని అన్నారు. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనే దిక్కులేక రెండు నెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్తనాదాలు చేస్తున్నారని పేర్కొన్నారు.
చేతకాని మీ సర్కారు నిర్వాకం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఏ మూలన చూసినా ఈరోజు రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారని చెప్పారు. పంట అమ్ముకుందామనే ఆశతో వచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు పడలేక కొనుగోలు కేంద్రాల్లోనే గుండెపగిలి కుప్పకూలుతున్నా మీ సర్కారుకు చీమకుట్టినట్టుగా కూడా లేదని విమర్శించారు.
70 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో మీకున్న శ్రద్ధలో ఒక్క శాతం రైతులపై పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. మీ కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి మోసే పనులు తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనాలన్న సోయి మాత్రం మీలో కనిపించడం లేదన్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద దాదాపు పదిమంది రైతులు వడదెబ్బతో పాటు సర్కారు చేసిన ద్రోహానికి తమ నిండు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు.
ధాన్యం కుప్పలు మీ అసమర్థతకు ప్రత్యక్ష సాక్ష్యాలని కేటీఆర్ పేర్కొన్నారు. విలువైన భూములను తెగనమ్మి వేల కోట్లు దోచుకోవాలన్న ఉత్సాహం తప్ప రైతుల పంటలను కొనాలన్న ధ్యాస మీలో ఏమాత్రం కనిపించడం లేదన్నారు. వరంగల్ నుంచి ఖమ్మం వరకు అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కనీసం ఒక్కటంటే ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని ఆరోపించారు.
చివరికి గన్నీ బ్యాగు కోసం రైతులే రూ.50 చొప్పున డిపాజిట్ చేసే దుస్థితి తీసుకొచ్చినందుకు మీరు, మీ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని విమర్శించారు. అన్నదాతలు అడుగడుగునా పడిగాపులు పడుతుంటే వాటిని వదిలేసి పర్యాటక వారోత్సవాలు నిర్వహించాలన్న మీ సర్కారుకు ప్రాధాన్యతలే కాదు, పోయి కూడా లేదని తేలిపోయిందన్నారు. కేసీఆర్ హయాంలో మూడు నెలల ముందే పంటల కొనుగోలు ప్రణాళికలను పకడ్బందీగా అమలు చేసేవారని తెలిపారు. గన్నీ బ్యాగుల నుంచి మొదలుకుని రైతుల ఖాతాల్లో పంట డబ్బులు సకాలంలో జమ అయ్యే వరకు నిరంతర సమీక్షలతో పర్యవేక్షించేవారని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి తమ పంటను కాపాడుకునేందుకు చివరకు టార్పాలిన్లు కూడా సమకూర్చలేని మీ కాంగ్రెస్ సర్కారు ఉండి రైతులకు ఏం ప్రయోజనం అని ప్రశ్నించారు.
60 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు మరణశాసనం రాసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రమంతా రైతుల నిరసనలు హోరెత్తుతున్న ఈ తరుణంలో 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలోనైనా లెంపలేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేటీఆర్ తన లేఖలో కోరారు.

## సమస్యలు ప్రస్తావిస్తే వ్యక్తిగత దూషణలా?



●ధాన్యం సకాలంలో కొనుగోలు చేయడంలో విఫలం
●ఇసుక అక్రమ రవాణా చేస్తున్నదెవరో చెప్పాలి
●మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ సవాల్

పెద్దపల్లి, నేటిధాత్రి:
పెద్దపల్లి నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న కొనుగోళ్ల సమస్యలు, మట్టి తరలింపు వంటి అంశాలపై తాను మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడితే.. రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా, పెద్దపల్లి ఎమ్మెల్యేగా పనిచేస్తున్న చింతకుంట విజయరమణారావు విచక్షణ కోల్పోయి మాట్లాడటం ఆయన సంస్కారానికే నిదర్శనమని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హితవు పలికారు. గురువారం పెద్దపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. "లుచ్చా పని చేసేటోడికి అందరూ లుచ్చలాగే కనిపిస్తారు.. దొంగ పని చేసేటోడికి అందరూ దొంగలాగే కనిపిస్తారు" అంటూ చురకలు అంటించారు. మట్టి వ్యవహారంపై స్పందిస్తూ, తాను చెరువు మట్టిని పొలాల్లో వేయడం అనేది అప్పటి ప్రభుత్వ పథకం "మిషన్ కాకతీయ"లో భాగమన్నారు. చెరువులు లోతు కావాలి, మట్టి పొలాల్లో పడాలి, భూసారం పెరగాలి అనే ఆలోచనతో ప్రభుత్వం ఆ పథకం తీసుకువచ్చిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మైనింగ్, ఇరిగేషన్ శాఖల ద్వారా నియంత్రణ తీసుకువచ్చి రైతులకు మట్టి వినియోగాన్ని ప్రోత్సహించిందని పేర్కొన్నారు. ఇసుక అక్రమాల అంశంలో కూడా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. స్థానిక అవసరాల కోసం ఉచిత ఇసుక విధానం తానే తీసుకొచ్చానని, కానీ ఇప్పుడు అదే పేరుతో అక్రమ రవాణా జరుగుతోందని అన్నారు. పిట్టల ఎల్లయ్యపల్లి, నారాయణపూర్, సుగ్లాంపల్లి ప్రాంతాల్లో ఇసుక డంపులు వేసి రాత్రిళ్లు హైదరాబాద్‌కు లారీలు పంపుతున్నారని ఆరోపించారు. ఇసుక లారీలను పట్టుకున్న అధికారులను బదిలీ చేసిన ఘటనలను కూడా ఆయన ప్రస్తావించారు.
ఎన్నికల్లో తప్పుడు హామీలు, అబద్ధాలతో గెలిచారని ఆరోపిస్తూ, ఇప్పుడు వాటిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. "తాను ఎక్కడికి వెళ్లినా ప్రజల నమ్మకంతో ఒంటరిగానే వెళ్తానని, కొందరిలా వంద మందిని వెంటేసుకుని తిరగాల్సిన భయం తనకు లేదని" ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాజకీయ బురదజల్లే ప్రయత్నాలు మానుకుని, మాట్లాడే ముందు నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు. వరి, మొక్కజొన్న రైతుల సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అధిక తూకాలు, ధాన్యం గ్రేడింగ్‌లో జరుగుతున్న అక్రమాలు, బార్దానా కొరత, మట్టి-ఇసుక దందాలు, ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి వంటి అనేక అంశాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి రాత్రింబవళ్లు అక్కడే తింటూ, అక్కడే పడుకుంటూ కాపలా కాస్తున్న పరిస్థితిని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్, ఓదెల, జూలపల్లి, పెద్దపల్లి వంటి ప్రాంతాల్లో గతంలో కూడా రైతులు మొక్కజొన్నను ప్రభుత్వ కేంద్రాల్లో అమ్ముకున్నారని పేర్కొన్నారు. ఇదేదో కొత్త విషయం జరిగినట్టు మాట్లాడుతున్నారన్నారు.

## దళారులకు ధాన్యం అమ్ముకోవద్దు



రైతులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి సూచన

ఆసిఫాబాద్, నేటిధాత్రి:
రైతులు తాము పండించిన జొన్న ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మార్కెట్ కమిటీ గోదాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో క్వింటాల్ జొన్నలకు మద్దతు ధర రూ.3,699 చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుమేత విశ్వనాథ్ రావు, జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాశ్, జైనూర్ సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, ఆసిఫాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ పాల్గొన్నారు.

FOLLOW US neti_dhatri WATCH US Netidhatri TV FOLLOW US netidhatri FOLLOW US Netidhatri News 22-05-2026 నేటిధాత్రి

# నేటిధాత్రి కథనానికి స్పందన

## లీకేజ్ కి చెక్ పెట్టి - తాగు నీటి వృధా అరికట్టారు



**జైపూర్, నేటిధాత్రి:** జైపూర్ మండలం ముదిగుంట గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా రోడ్లపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ 'నేటి ధాత్రి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి యంత్రాంగం వేగంగా స్పందించింది. గురువారం ఉదయమే రంగంలోకి దిగిన పంచాయతీ సిబ్బంది పాడైపోయిన కుళాయి స్థానంలో కొత్తగా ఆన్,ఆఫ్ చేసే 'కీ' అమర్చి మరమ్మతులు చేపట్టారు. పైపులైన్ నుంచి నీరు వృథా కాకుండా అరికట్టడంతో పాటు,నీరు నిల్వ ఉన్న చుట్టుపక్కల ప్రాంతాల్లో దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలను శుద్ధి చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సురేష్ తెలిపారు. సమస్యను వెలుగులోకి తెచ్చి అధికారుల కళ్లు తెరిపించిన 'నేటి ధాత్రి' పత్రిక యాజమాన్యానికి,తక్షణమే స్పందించి చర్యలు తీసుకున్న అధికారులకు ముదిగుంట గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

# మహా న్యూస్ ఛానల్‌పై చర్యలు తీసుకోవాలి



## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంద శ్యామ్ సుందర్ ఆరోపణ...డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శ....ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్....

**నర్సంపేట, నేటిధాత్రి:** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ అవమానకర ప్రసారాలు నిర్వహిస్తున్న మహా న్యూస్ తెలుగు టీవీ ఛానల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంద శ్యామ్ సుందర్ ఆరోపించారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా స్వేరోస్ మరియు బీఆర్ఎస్ నాయకులతో కలిసి వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత మూడు రోజులుగా "డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గారి కొడుకులు మంచి వాళ్లా, చెడ్డ వాళ్లా" అనే విధంగా ట్రోలింగ్లు, ప్రసారాలు నిర్వహిస్తూ సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమాలు మహా న్యూస్ ఎండీ వంశీ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయని ఆరోపించారు. ఫోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని కోరిన నేపథ్యంలో రాజకీయ కక్షతో ఆయనను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం చేస్తున్నారని మంద శ్యామ్ సుందర్ అన్నారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన నాయకుడైన ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పరువు ప్రతిష్టలను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మహా న్యూస్ ఛానల్ యాజమాన్యం మరియు ఎండీ వంశీ కృష్ణపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, అవమానకర ప్రసారాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ట్రోలింగ్ ద్వారా భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంటరు చక్రి, పుష్పత్తులయ, మరపెల్లి మనోజ్, శనిగరం శ్రీనివాస్, జన్ను హరికృష్ణ, తేళ్లూరి సురేష్, దుడేలా సిద్ధు, కొగిలా కిరణ్, మోట్ల మౌనిక, రాజేశ్వరి, అంబాల చింటూ, గుర్రం సుశ్రుథ్ తదితరులు పాల్గొన్నారు.

# కాన్కూర్ లో ఉచిత వైద్య శిబిరం



జైపూర్, నేటిధాత్రి: మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం జైపూర్ మండలం కాన్కూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి పైగా రోగులకు నిపుణులైన వైద్యులు సేవలందించారు. అవసరమైన వారికి షుగర్,బీపీ,ఈసీజీ పరీక్షలు నిర్వహించి తక్షణ రోగ నిర్ధారణ చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. పండుగలు,సెలవులు అనే తేడా లేకుండా 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే రోగులను కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రికి తరలించి ఆధునిక వైద్యం అందిస్తామని తెలిపారు. గ్రామ సర్పంచ్ కొయ్యడ సాగరిక,ఉపసర్పంచ్ పున్నం చందు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించిన మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్,అబ్దుల్ వకీల్,శ్రీకాంత్, సిద్ధు,వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మీ పిల్లల చేతికి బండి ఇస్తున్నారా జైలుకు వెళ్తారు జాగ్రత్త.

## మైనర్ డ్రైవింగ్‌పై కోదాడ పోలీసుల ఉక్కుపాదం....పట్టణ సీఐ శివశంకం



**కోదాడ, నేటిధాత్రి:** మైనర్ల చేతుల్లో వాహనాలు పెడితే ప్రమాదాలు తప్పవని, అలాంటి వారిని ప్రోత్సహించే తల్లిదండ్రులు కూడా చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కోదాడ పట్టణ సీఐ శివశంకర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం కోదాడ పట్టణంలోని ప్రధాన రహదారులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన పోలీసులు మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడుతున్న 10 మంది బాలురను గుర్తించి వారి తల్లిదండ్రులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ. ఇటీవల మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనం నడపడానికి సరైన వయస్సు, చట్టబద్ధమైన డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. మైనర్లకు బైక్‌లు, స్కూటీలు ఇవ్వడం తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, ప్రమాదం జరిగితే కుటుంబాలే తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని. వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, సి-బుక్, ఇన్సూరెన్స్ పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ వినియోగంతో రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం వరకు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన సీఐ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై బైరెడ్డి అంజిరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు బాల్తు శ్రీనివాస్, నరహరి తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంమ్ గార్డ్ కుటుంబానికి ఇన్సూరెన్స్ భరోసా

## ముప్పైలక్షల రూపాయల చెక్ అందజేసిన జిల్లా ఎస్పీ మహేష్ బీ. గితే



**సిరిసిల్ల, నేటిధాత్రి:** సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలోని డిసిర్బీలో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన హోమ్ గార్డ్ దేవయ్య యాక్సిస్ బ్యాంక్ లో సాలరీ అకౌంట్ ఉన్నందున యాక్సిడెంట్లాల్ డెత్ కింద మంజూరు కాబడిన 30 లక్షల ఇన్సూరెన్స్ చెక్ యాక్సిస్ బ్యాంక్ యాజమాన్యం జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే గారి చేతుల మీదుగాదేవయ్య కుటుంబ సభ్యులకు ఈరోజు అందజేయడం జరిగింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన హోమ్ గార్డ్ దేవయ్య మరణం పోలీస్ శాఖకు తీరని లోటని,దేవయ్య కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పోలీస్ సిబ్బంది,హోమ్ గార్డులు తమ విధులను నిర్వర్తించే సమయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిఎస్పీ లో నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, ఆర్.ఐ రమేష్, యాక్సిస్ బ్యాంక్ యాజమాన్యం, దేవయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పేద ప్రజల కోసం తపించిన వ్యక్తి శాంతి ప్రకాష్ శుక్లా


## ఉమ్మడి కరీంనగర్ జిల్లా జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు రామరాజు.... శాంతి ప్రకాష్ శుక్ల ఆశయాల సాధన కోసం నేటి యువతరం , ప్రజానీకం ముందుకు కదలాలి...సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్....




**సిరిసిల్ల, నేటిధాత్రి:** స్వాతంత్ర సమరయోధులు , తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకులు , సిరిసిల్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్.. అమృత లాల్ శుక్లా తనయుడు ప్రముఖ న్యాయవాది , సమాజ సేవకులు , కమ్యూనిస్టు శ్రేయోభిలాషి శాంతి ప్రకాష్ శుక్లా దినకర్మ సందర్భంగా ఈరోజు సిరిసిల్ల పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న వారి ఇంటి వద్ద ఆయన సంస్మరణ సభను వారి కుటుంబ సభ్యులు , మిత్రులు , శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఇటీవ్ సంస్మరణ సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ అధ్యక్షత వహించారు సభ ప్రారంభానికి ముందు శాంతి ప్రకాష్ శుక్ల గారి చిత్రపటానికిఈ శుక్లా కుటుంబ సభ్యులతో పాటుగా సభకు హాజరైన వారందరూ ఘనంగా నివాళులు అర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సంస్మరణ సభను ఉద్దేశించి జన విజ్ఞాన వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపన అధ్యక్షులు రామరాజు , సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ గారు , సిరిసిల్ల సాహితీ సమితి అధ్యక్షులు జలపాల శంకరయ్య , ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ , గీత, సీనియర్ పాత్రికేయులు తడుక విశ్వనాథంజన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు సంపత్ రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# రూ.60 లక్షలతో రాజీవ్‌గాంధీ టౌన్‌షిప్‌లో పార్కు, విగ్రహానికి శంకుస్థాపన

## ప్రారంభించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్‌రాంరెడ్డి.... హాజరైన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని, దొంతి, కలెక్టర్ సత్యశారద....



**గీసుగొండ, నేటిధాత్రి:** గీసుగొండ మండలంలోని టెక్స్‌టైల్ పార్క్ పరిధిలో గల రాజీవ్‌గాంధీ టౌన్‌షిప్‌లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ నిధులు రూ.60 లక్షలతో నిర్మించనున్న రాజీవ్‌గాంధీ విగ్రహం, నూతన పార్కు అభివృద్ధి పనులకు గురువారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కూడా చైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్‌రాంరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు అయ్యూబ్ అలీ, మాజీ మేయర్ గుండు సుధారాణి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, కూడా పీవో అజిత్‌రెడ్డి పాల్గొన్నారు. టౌన్‌షిప్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించేలా పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు కూడా చైర్మన్ ఇనగాల వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గీసుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దాడి శివ, సంగెం మండల అధ్యక్షుడు ఇండ్ల రవి, మాజీ మండల అధ్యక్షుడు తుమ్మలపెల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బీమాగాని సౌజన్య, సమన్వయ కమిటీ సభ్యుడు ఆకుల రుద్రప్రసాద్, సర్పంచ్ గాలి యాకయ్య, ఉప సర్పంచ్ ఊరుగొండ అనిత మురళి, గ్రామ పార్టీ అధ్యక్షుడు జూల రమేష్, మాజీ ఎంపీటీసీ కాగిత భిక్షపతి, పరకాల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేకల అనిల్ యాదవ్,వార్డు సభ్యుడు సుధమళ్ల పవన్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కి జన్మదిన వేడుకలు.

**కల్వకుర్తి, నేటిధాత్రి:** కల్వకుర్తి పట్టణంలోని వై ఆర్ ఆర్ కాంప్లెక్స్ లో రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనను కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్యవైశ్య నాయకులు జూలూరు రమేష్ బాబు, కొండూరుగోవర్ధన్, చిగుళ్లపల్లి శ్రీధర్, పోల సురేందర్, గార్లపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలోరాజీవ్ గాంధీ వర్ధంతి..



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జలగం ప్రవీణ్. మాజీ ప్రధాని . కీ.శే. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. జాతి నిర్మాణంలో యువతకు ప్రాధాన్యత కల్పించాలని ఉద్దేశంతో ఓటు కనిష్ట వయోపరిమితిని .21. సంవత్సరాలు నుండి. .18. సంవత్సరాలకు తగ్గించిన ఘనత రాజీవ్ గాంధీ అని. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి మహిళ సాధారికతకు కృషిచేసిన మహిళ పక్షపాతి రాజీవ్ గాంధీ అని. దేశంలో సమాచార ఎలక్ట్రానిక్ విప్లవానికి రాజీవ్ వైద్యుడు అని. ప్రపంచంలో పేరుగాంచిన ఐటీ రంగ సంస్థలకు మనదేశస్థుల. సీ.ఈ.వో.లు.గా నేడు కొనసాగడానికి రాజీవ్ గాంధీ దేశంలో వేసిన ఐటి పునాదులే దోహద.పడ్డాయని. ప్రజల కోసం ఉంటూ ప్రజల.తోనే ఉంటూ ప్రాణాలు విడిచిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని. ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు అనేక పథకాలు ఈరోజు భారతదేశంలో ప్రతి పౌరునికి అందుతున్నాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల సింగం గౌడ్.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జలగం ప్రవీణ్. కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగాల భూపతి. మచ్చ శ్రీనివాస్. పెద్దూరి తిరుపతి. సుద్దాల శ్రీనివాస్. భైరవేనీ రాము. కొత్త రవి. రాజశేఖర్. శ్రీకాంత్ గౌడ్. రాపెల్లి ఆనందం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ పనులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్....




**తంగళ్ళపల్లి,నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగ్రవాల్. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో పర్యటించి మండల కేంద్రంలోని ఉపాధి హామీ పనులను ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకే ఉపాధి హామీ పనులు చేయించాలని. ఉరచెరువులో జలసశీచాయ్-జన్ భగీదారి. కింద ఉపాధి హామీలు కొనసాగుతుండగా. కలెక్టర్ ఉపాధి హామీ పనులు పర్యవేక్షించి ప్రభుత్వ లక్ష్యం మేరకు కూలీలకు ఉపాధి హామీ కింద ఉపాధి హామీ కల్పించాలని ప్రతిరోజు 150 మంది పనికి వచ్చేలా చూడాలని. పనిచేసే చోట నీడ సదుపాయం తాగునీరు ఓవర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని. నిరక్షరాస్య కూలీల ఉల్లాస్ కింద చదువు నేర్చుకోవాలని. రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులు సన్న సన్న వడ్లు సాగు చేయాలని. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ( పి.ఎసిఎస్). కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి ఈప్పటిదాకా ధాన్యం ఎంత వచ్చింది ఎంత కొనుగోలు చేశారు ఎంత రైస్ మిల్లులకు తరలించారు కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే రైస్ మిల్లులకు గోదాములకుతరలించాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లకు వాహనాలు సమకూర్చాలని సూచిస్తూ. కొనుగోలు కేంద్రాలలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలియజేశారు. ఇట్టి పరిశీలన కార్యక్రమంలో. డి ఆర్ డి ఓ. లక్ష్మీనారాయణ. డి సి ఎస్ ఓ. బుచ్చిబాబు. జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం. సహకార అధికారి రామకృష్ణ. ఎంపీడీవో. రమేష్. ఇన్చార్జి తహసిల్దార్ మురళి. తంగళ్ళపల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మి రాజం. గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామపంచాయతీ పాలకవర్గం. ఉపాధి హామీ కూలీలు హమాలీలు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు


# బిఎల్ఏ ఓటర్ లిస్ట్ జాబితాను ఎన్నికల అధికారులకు సమర్పించిన కాంగ్రెస్ నాయకులు

## మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో మాజీ మంత్రివర్యులు డా॥ఏ.చంద్రశేఖర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం జహీరాబాద్ నియోజకవర్గంలోని సంబంధిత పోలింగ్ స్టేషన్లు మరియు ప్రాంతాలకు సంబంధించిన బూత్ లెవల్ ఏజెంట్ల ( బిఎల్ఏ ) జాబితాను వారి పరిశీలనార్థం మరియు అవసరమైన రికార్డు నిమిత్తం ( ఆర్డిఓ ) రెవిన్యూ డీవిజన్ ఎన్నికల అధికారికి వారి కార్యాలయంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో బడుగుబలహీన వర్గాల ప్రజల ఓట్లు తొలగించాలని కేంద్ర సర్కార్ బీజేపీ ప్రభుత్వం తెర లేపింది. ( ఎస్ఐఆర్ ) ఓటర్ జాబిత ప్రక్రియను కట్టుదిట్టంగా మరియు పారదర్శకంగా నిర్వహించి,అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటర్ జాబితాలో నమోదు కావాలని, నకిలీ మరియు అనర్హత ఓట్లను తొలగించే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ జాబితా కీలకమని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కండేం.నర్సింలు, మొగుడంపల్లి మండల అధ్యక్షులు మాక్సూద్ అహ్మద్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సామెల్,మాజీ వైస్ చైర్మన్ ఖాజా,టీపీసీసీ కో- ఆర్డినటర్ గౌస్, కౌన్సిలర్ మహేష్, సర్పంచ్ రాజు,ఏ.యం.సి డైరెక్టర్ శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హుగ్గేల్లి రాములు,నాయిమ్ మొయిజ్,గౌస్,ఆయుబ్,అడ్వొకేటే వాజహత్,యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నరేష్ గౌడ్,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పచ్చిగా తింటేనే మంచి



ఆరోగ్యంపై శ్రద్ధ చూపేవారు అనేక రకాల కూరగాయలను డైట్‌లో భాగం చేసుకుంటారు. రకరకాల కూరలు వండుకొని తింటుంటారు. అయితే, వంట చేసేక్రమంలో.. కొన్ని కూరగాయల్లో పోషకాలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిని పచ్చిగా తినడమే మంచిదని సలహా ఇస్తున్నారు.



రెడ్ బెల్‌పెప్పర్‌లో విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంది. అయితే, అధిక వేడికి గురైనప్పుడు ఇందులోని ఆస్కార్బిక్ ఆమ్లం స్థాయులు గణనీయంగా పడిపోతాయి. ఉడకబెట్టినా, ఆవిరి చేసినా.. పోషకాలన్నిటినీ కోల్పోతుంది.



అందుకే, రెడ్ బెల్‌పెప్పర్‌ను పచ్చిగా తిన్నప్పుడే.. ఇందులోని విటమిన్ సి గరిష్ఠస్థాయిలో లభిస్తుంది. ఇతర కెరోటినాయిడ్లు, పాలీఫెనాల్స్ కూడా శరీరానికి అందుతాయి. రెడ్ బెల్‌పెప్పర్స్‌ను సలాడ్ రూపంలో తీసుకోవడమే మంచిది.

బ్రొకోలీలో యాంటి ఇన్‌ఫ్లమేటరీ, కీమోప్రొటెక్టివ్ లక్షణాలు కలిగిన 'మైరోసినేస్' అనే ఎంజైమ్ ఉంటుంది. అధిక వేడిలో ఈ ఎంజైమ్ నిష్క్రియంగా మారిపోతుంది. దాంతో, శరీరానికి బ్రొకోలీ సుగుణాలు అందకుండా పోతాయి. వండిన బ్రొకోలీతో పోలిస్తే.. పచ్చిదాంట్లోనే 10 రెట్లు ఎక్కువగా సల్ఫోరాఫేన్ అనే యాంటి ఆక్సిడెంట్ లభిస్తుంది.

వెల్లుల్లిలో యాంటి ఆక్సిడెంట్లు, సల్ఫ్యూరిక్ సమ్మేళనాలు అధికంగా లభిస్తాయి. ఇవి శరీరానికి అనేక ప్రయోజనాలు అందిస్తాయి. అయితే,



వెల్లుల్లిని వేడి చేయడం వల్ల.. ఇందులోని అల్లిసిన్, ఆర్గానోసల్ఫర్ సమ్మేళనాలు పాక్షికంగా నాశనం అవుతాయి. కాబట్టి వెల్లుల్లి పూర్తి ప్రయోజనాలు అందాలంటే.. దీనిని పచ్చిగా తినడమే మంచిది. అయితే, పచ్చి వెల్లుల్లి కొంతమందిలో కడుపుని చికాకు పెడుతుంది. కాబట్టి, తీసుకునే ముందు నిపుణులను సంప్రదించడం అవసరం.

ఎక్కువసేపు వేడి చేసినప్పుడు ఉల్లిపాయల్లోని క్వెర్సెటిన్, సల్ఫర్ సమ్మేళనాలు దెబ్బతింటాయి. సాధారణ వంట

# రోజులో డ్రై ఫ్రూట్స్ ను అసలు ఏ సమయంలో తినాలి..?

## ఎప్పుడు వీటిని తింటే మనకు ఎక్కువ మేలు జరుగుతుంది..?



మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచడం కోసం అనేక రకాల పోషకాహారాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో డ్రై ఫ్రూట్స్ కూడా ఒకటి. కిస్మిస్‌లు, అంజీర్, ఆలుబుఖర వంటివి డ్రై ఫ్రూట్స్ జాబితాకు చెందుతాయి. అంజీర్, ఆలుబుఖరతోపాటు యాప్రికాట్స్ కూడా మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా ఇంకా అనేక డ్రై ఫ్రూట్స్‌ను చాలా మంది తింటుంటారు. డ్రై ఫ్రూట్స్‌ను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. పలు వ్యాధులను నయం చేయడంలోనూ డ్రై ఫ్రూట్స్ మనకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను రోజులో అసలు ఏ సమయంలో తినాలి..? ఎప్పుడు వీటిని తింటే మనకు అధిక శాతం లాభాలు కలుగుతాయి..? అని చాలా మందికి ప్రశ్నలు తలెత్తుతుంటాయి. ఇక ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

### ఏ సమయంలో తినాలి..?

డ్రై ఫ్రూట్స్ లలో మన శరీరానికి కావల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, బి కాంప్లెక్స్, సితోపాటు పొటాషియం, మెగ్నిషియం, జింక్ వంటి మినరల్స్‌ను మనం డ్రై ఫ్రూట్స్ ద్వారా పొందవచ్చు. ఈ క్రమంలో ఈ పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. పలు వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను ఉదయం తింటేనే అధిక మొత్తంలో లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉదయం వీటిని బ్రేక్ ఫాస్ట్ తోపాటు కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. దీని వల్ల అధిక మొత్తంలో పోషకాలు, ఆరోగ్యకర ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

### రోజంతా యాక్టివ్‌గా..

రాత్రంతా మన శరీరానికి ఎలాంటి ఆహారం లభించదు. సుమారుగా 10 నుంచి 14 గంటల పాటు శరీరం ఉపవాస దశలో ఉంటుంది. కనుక ఉదయం పూట శరీరానికి పెద్ద ఎత్తున శక్తి అవసరం అవుతుంది. ఈ క్రమంలో డ్రై ఫ్రూట్స్ ను తినడం వల్ల ఆ శక్తిని చాలా వరకు భర్తీ చేయవచ్చు. పైగా ఉదయం నుంచి మనం పనుల్లో యాక్టివ్‌గా ఉంటాం. కొందరు శారీరక శ్రమ కూడా చేస్తుంటారు. కనుక ఉదయం మన శరీరానికి శక్తి అధికంగా అవసరం అవుతుంది. ఇలాంటి సమయంలో డ్రై ఫ్రూట్స్ ను తింటే కావల్సినంత శక్తి లభిస్తుంది. దీంతో రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్ధకం పోతుంది. కనుక డ్రై ఫ్రూట్స్ ను ఉదయం పూట తింటేనే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

### ఇలా కూడా చేయవచ్చు..

అయితే ఉదయం పూట డ్రై ఫ్రూట్స్ ను తినేంత సమయం లేదని భావిస్తే వాటిని మీరు బాక్స్ లో పెట్టుకుని ఆఫీస్‌కు తీసుకెళ్లి తరువాత తినవచ్చు. ఇక అలా కూడా వీలు కావడం లేదని అనుకుంటే సాయంత్రం సమయంలో స్నాక్స్ రూపంలో తినాలి. కానీ ఆ సమయంలో మనకు పెద్దగా శక్తి అవసరం ఉండదు. కనుక డ్రై ఫ్రూట్స్ ను మోతాదుకు కాస్త తక్కువగా తినాలి. ఇలా డ్రై ఫ్రూట్స్ ను తింటే మన శరీరంలో శక్తి స్థాయిలు ఎల్లప్పుడూ అధికంగానే ఉంటాయి. దీంతో నీరసం, అలసట అసలు రావు. ఉత్సాహంగా ఉండి చురుగ్గా పనిచేస్తారు. డ్రై ఫ్రూట్స్ ను ఇలా తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# రోజూ ఈ ఆహారాలను తినండి..

## మీ జుట్టు వేగంగా పెరుగుతుంది.. జుట్టు అసలు రాలదు..

ప్రస్తుతం చాలా మంది అనేక రకాల జుట్టు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వాటిల్లో జుట్టు రాలడం కూడా ఒకటి. జుట్టు రాలిపోయేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. థైరాయిడ్, ఒత్తిడి, ఆందోళన, కాలుష్యం, దీర్ఘకాలిక వ్యాధులు ఉండడం, మందులను అధికంగా వాడడం వంటి వాటితోపాటు పోషకాహార లోపం వల్ల కూడా ఈ సమస్య వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం చాలా మంది సరైన ఆహారాలను తినడం లేదు. బయటి ఫుడ్‌ను ఎక్కువగా తింటున్నారు. దీని కారణంగా చాలా మందిలో పోషకాహార లోపం సమస్య తలెత్తుతోంది. ఇది జుట్టు రాలేందుకు కారణం అవుతోంది. అయితే రోజూ మనం తినే ఆహారాల విషయంలో పలు మార్పులు చేసుకుంటే జుట్టు రాలే సమస్యను చాలా సులభంగా తగ్గించుకోవచ్చు. మనం తినే ఆహారాలే మన జుట్టు పెరుగుదలను ప్రభావితం చేస్తాయి. కనుక పోషకాలు ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది.

### ఆకుకూరలు..

జుట్టు రాలిపోయేందుకు ప్రధాన కారణం మన శరీరంలో తగినంత మోతాదులో మినరల్స్ లేకపోవడమే అని చెప్పవచ్చు. ముఖ్యంగా ఫోలేట్, ఐరన్‌తోపాటు విటమిన్లు ఎ, సి తక్కువగా ఉండడం లేదా లోపం వల్ల జుట్టు రాలిపోతుంది. కనుక ఈ పోషకాలు మనకు లభించేలా చూసుకోవాలి. ఇందుకు గాను రోజూ పాలకూర జ్యూస్‌ను తాగాలి. పాలకూరలో అధికంగా పోషకాలు ఉంటాయి. ఇందులో ఉండే విటమిన్లు ఎ, సి, క్యాల్షియం, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తాయి. కనుక రోజూ పాలకూర జ్యూస్‌ను తాగుతుంటే ఫలితం ఉంటుంది. అలాగే రోజూ దాల్చిన చెక్కను ఆహారంలో భాగం చేసుకుంటే జుట్టు పెరుగుదలకు ఎంతో దోహదం చేస్తుంది. దాల్చిన చెక్క పొడిని మీరు తినే ఆహారాలపై చల్లి తినవచ్చు. లేదా ఈ చెక్కను నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. దీని వల్ల కేవలం జుట్టు పెరగడమే కాకుండా షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

### గింజలు, విత్తనాలు..

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే గింజలు, విత్తనాలను రోజూ తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ముఖ్యంగా బాదంపప్పు, పిస్తా, వాల్ నట్స్, జీడిపప్పు, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, అవిసె గింజలు, చియా సీడ్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తాయి. అలాగే గుండెను కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ గింజలు, విత్తనాల్లో విటమిన్ ఇ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జుట్టును సంరక్షిస్తుంది. శిరోజాలు పెరిగేలా చేస్తుంది. అలాగే సోయాబీన్ ఉత్పత్తులను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. సోయా టోఫు, సోయా పాలు, సోయా గింజలను తీసుకోవాలి. వీటిల్లో ఉండే క్యాల్షియం, ఐరన్, ఇతర పోషకాలు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. జుట్టు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

### కోడిగుడ్లు, చేపలు..

రోజూ ఒక కోడిగుడ్డును ఆహారంలో భాగం చేసుకుంటే శరీరానికి బయోటిన్ అధికంగా లభిస్తుంది. ఇది జుట్టు



ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. కోడిగుడ్లలో ప్రోటీన్లు, జింక్, సెలీనియం అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి కూడా శిరోజాలను సంరక్షిస్తాయి. అలాగే వారంలో కనీసం 2 సార్లు చేపలను తింటున్నా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఇతర ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్ డి ఉంటాయి. ఇవన్నీ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. ఇలా ఆయా ఆహారాలను రోజూ తీసుకుంటే జుట్టు రాలడాన్ని తగ్గించుకోవచ్చు. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే అన్ని పోషకాలు లభించి ఆరోగ్యంగా ఉంటారు. ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు.

# మీ కనుబొమ్మలు ఒత్తుగా పెరిగి అందంగా కనిపించాలా..?

ముఖం అందంగా కనిపించడంలో కనుబొమ్మలు ముఖ్య పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు. అందమైన, వత్తుగా ఉండే కనుబొమ్మలు ముఖ అందాన్ని పెంచడంలోనే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. కనుబొమ్మలు అందంగా కనిపించడానికి స్త్రీలు ఎంతో ఖర్చు చేస్తారని కూడా చెప్పవచ్చు. అయితే కొందరిలో కనుబొమ్మలు చాలా పలుచగా ఉంటాయి. దీంతో వారు ఆత్మనూన్యత భావనకు గురి అవుతూ ఉంటారు. అలాంటి వారు ఇప్పుడు చెప్పే కొన్ని రకాల ఇంటి చిట్కాలను పాటించడం వల్ల కనుబొమ్మలు ఒత్తుగా, నల్లగా, అందంగా తయారవుతాయి. కనుబొమ్మల అందాన్ని మెరుగుపరిచే చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### ఆముదం నూనె..

కనుబొమ్మలు పలుచగా ఉన్న వారు రోజూ వాటిపై ఆముదం నూనెను రాయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఆముదం నూనెలో విటమిన్లు, ప్రోటీన్లు, కొవ్వు ఆమ్లాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది కుదుళ్లు వేగంగా, నల్లగా పెరిగేలా ప్రోత్సహిస్తుంది. దూది లేదా సున్నితమైన బ్రష్ తో రోజూ కనుబొమ్మలపై ఆముదం నూనెను రాయడం వల్ల కనుబొమ్మలు ఒత్తుగా పెరుగుతాయి. అలాగే ఉల్లిపాయలల్లో సల్ఫర్ అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఉల్లిపాయ రసాన్ని రోజూ రెండుసార్లు కనుబొమ్మలపై రాసి 15 నుండి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. ఇలా చేయడం వల్ల కనుబొమ్మలు అందంగా తయారవుతాయి.

### కలబంద..

కలబంద ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను, సౌందర్య ప్రయోజనాలను అందిస్తుందన్న సంగతి మనకు తెలిసిందే.



దీనిలో విటమిన్లు. ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో ఇవి ఎంతగానో సహాయపడతాయి. తాజా కలబంద జెల్ ను కనుబొమ్మలపై రాసి 30 నిమిషాల పాటు అలాగే ఉంచి తరువాత శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ రెండు సార్లు చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అదేవిధంగా కొబ్బరి నూనెలో లారిక్ ఆమ్లాలు, విటమిన్లు. ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఇది అందరి ఇండ్లల్లోనూ ఉంటుంది. జుట్టు పెరుగుదలకు, ఆరోగ్యానికి ఇది ఎంతో తోడ్పడుతుంది. రోజూ రాత్రి పడుకునే ముందు కనుబొమ్మలపై కొబ్బరి నూనెను రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల కనుబొమ్మలు ఒత్తుగా, నల్లగా పెరుగుతాయి.

### రోజ్‌మేరీ నూనె..

రోజ్‌మేరీ నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి వెంట్రుకలకు రక్తప్రసరణను పెంచి అవి వేగంగా పెరిగేలా చేయడంలో తోడ్పడతాయి. కొబ్బరి నూనెలో రోజ్‌మేరీ నూనెను కలిపి కనుబొమ్మలపై సున్నితంగా రాసి మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల కొన్ని వారాల్లోనే చక్కటి ఫలితాలను పొందవచ్చు.

# కేవలం చపాతీలు మాత్రమే కాదు.. ఈ రొట్టెలను కూడా తరచూ తినండి.. అనేక లాభాలు కలుగుతాయి..!

చపాతీలు.. ఈ పేరు చెప్పగానే మనకు గోధుమ పిండితో చేసే చపాతీలే గుర్తుకు వస్తాయి. చాలా మంది ఈ పిండితోనే చపాతీలను తయారు చేసి తింటారు. చపాతీలు వాస్తవానికి ఎంతో రుచిగా ఉంటాయి. ఏ కూరతో అయినా సరే తినవచ్చు. అధిక బరువు తగ్గాలని చూసేవారు, షుగర్ ఉన్నవారు, ఇతర అనారోగ్య సమస్యలు లేదా వ్యాధులు ఉన్నవారు రాత్రి పూట అన్నం మానేసి చపాతీలను తింటుండడం మనం చూస్తూనే ఉంటాం. అయితే నిజానికి చపాతీలను కేవలం గోధుమ పిండితోనేకాదు, పలు ఇతర చిరుధాన్యాలకు చెందిన పిండిలతోనూ తయారు చేయవచ్చు. అవి కూడా ఎంతో రుచిగా ఉంటాయి. ఆయా పిండిలతో తయారు చేసే చపాతీలను రాత్రి పూట తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. రోజూ కేవలం గోధుమ పిండితోనే కాకుండా వివిధ రకా చిరు ధాన్యాలతోనూ పిండి తయారు చేసి దాంతో చపాతీలను తయారు చేసి తింటుంటే అనేక లాభాలు కలుగుతాయి. అనేక రకాల పోషకాలను పొందవచ్చు. ఇవి మనల్ని రోగాల నుంచి రక్షిస్తాయి.

### జొన్న రొట్టెలు..

పూర్వం చాలా మంది జొన్న పిండితో రొట్టెలను తయారు చేసే తినేవారు. కానీ ఇప్పుడు ఇలా తినడం తగ్గించేశారు. ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్న కొందరు మాత్రం ప్రస్తుతం జొన్న రొట్టెలను తింటున్నారు. జొన్నలను పిండిగా మార్చి వాటితో రొట్టెలను తయారు చేసి రోజూ తింటే అనేక లాభాలు కలుగుతాయి. షుగర్ ఉన్నవారికి ఈ రొట్టెలు ఎంతో మేలు చేస్తాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా సహాయం చేస్తాయి. జొన్నల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. జొన్నల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇలా జొన్న రొట్టెలతో లాభాలను పొందవచ్చు.

### రాగి రొట్టెలు..

ఇక రాగులతోనూ రొట్టెలను తయారు చేసి తినవచ్చు. రాగి పిండితో వీటిని తయారు చేస్తారు. ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. రాగి రొట్టెలను తినడం వల్ల క్యాల్షియం అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది దంతాలు, ఎముకలను దృఢంగా



మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. రాగి రొట్టెలను తింటే ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తాయి. మనల్ని యాక్టివ్‌గా ఉండేలా చేస్తాయి. ఉత్సాహంగా ఉంటాము. చురుగ్గా పనిచేస్తాము. నీరసం, అలసట తగ్గుతాయి. బద్ధకం పోతుంది. రాగుల్లో ఉండే మెగ్నిషియం కారణంగా కండరాలు ప్రశాంతంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. కండరాల నొప్పులు తగ్గుతాయి. ముఖ్యంగా రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోకుండా ఉంటాయి. అలాగే రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో కొలెస్ట్రాల్ తగ్గి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇలా రాగి రొట్టెలతో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

### సజ్జ రొట్టెలు..

ఇక రాత్రి పూట తినాల్సిన రొట్టెల్లో సజ్జ రొట్టెలు కూడా ఒకటి. సజ్జలను పిండి మార్చి దాంతో రొట్టెలను తయారు చేయవచ్చు. ఇవి కూడా ఎంతో రుచిగా ఉంటాయి. అనేక లాభాలను అందిస్తాయి. షుగర్ లెవల్స్ అధికంగా ఉన్నవారు ఇతర రొట్టెల కన్నా సజ్జ రొట్టెలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. సజ్జల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. పైగా వీటిల్లో ఫైబర్ ఉంటుంది. కనుక ఈ రొట్టెలను తింటుంటే రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. దీని వల్ల షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఇక సజ్జల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. దీని వల్ల రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. అలాగే బరువు తగ్గాలనుకునే వారు రోజూ ఈ రొట్టెలను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఈ విధంగా సజ్జ రొట్టెలు మనకు మేలు చేస్తాయి. ఇలా రోజూ కేవలం గోధుమ పిండితో చేసే చపాతీలను మాత్రమే కాకుండా, రోజుకో రకం రొట్టెలను తింటుండాలి. దీంతో అన్ని రకాల పోషకాలు లభిస్తాయి. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# రోజూ ఉదయం పూట 10 నిమిషాల పాటు యోగా చేస్తే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..!

శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలను తగ్గించుకోవడానికి మనం అనేక రకాల వ్యాయామాలు చేస్తూ ఉంటాము. ఇలాంటి వ్యాయామాలల్లో యోగా కూడా ఒకటి. యోగాను ఎవరైనా కూడా చాలా సులభంగా చేయవచ్చు. చిన్న వయసు నుండే పిల్లలకు యోగా చేయడం నేర్పించడం వల్ల వారి ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుంది. రోజూ యోగా చేయడం వల్ల మనకు ఎంతో మేలు కలుగుతుంది. ఈ విషయాలను యోగా నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నిమిషాల పాటు యోగా చేయడం వల్ల మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

### రీసెట్ బటన్‌లాగా..


ఉదయం చేసే ఈ యోగా మనకు ఒక రీసెట్ బటన్ లాగా పనిచేస్తుంది. రోజంతా మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. పది నిమిషాల పాటు యోగా, శ్వాస వ్యాయామాలు చేయడం వల్ల శరీరం స్థిరంగా ఉంటుంది. మనసు తేలికగా ఉంటుంది. సరళమైన శ్వాస వ్యాయామాలు చేయడం వల్ల ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరంలో ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడతాయి. దీంతో శరీర శక్తి స్థాయిలు పెరుగుతాయి. అలాగే రాత్రంతా నిద్రపోవడం వల్ల కండరాలు బిగుతుగా తయారవుతాయి. శరీరం నొప్పులుగా అనిపిస్తుంది. అలాంటి వారు ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శరీర నొప్పులు తగ్గుతాయి. రోజూ యోగా చేయడం, సులభమైన ఆసనాలు వేయడం వల్ల మానసికంగా ఉత్సాహంగా తయారవుతారు. సులభంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు. మెదడు పదునుగా తయారవుతుంది.

### ఒత్తిడి హార్మోన్లు..

అంతేకాకుండా ఉదయం పూట ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ శరీరంలో ఎక్కువగా ఉంటుంది. రోజూ ఉదయం యోగా చేయడం వల్ల ఈ హార్మోన్ స్థాయిలు అదుపులో ఉంటాయి. శరీరం, మనసు ప్రశాంతంగా ఉంటాయి. రోజూ యోగా చేయడం, శరీరాన్ని వంచడం వంటి కొన్ని ఆసనాలు వేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రోజంతా అసౌకర్యం లేకుండా ఉంటుంది.

### వెన్నెముక ఆరోగ్యానికి..

ఉదయం పూట యోగా చేయడం వల్ల వెన్నెముక ఆరోగ్యం మెరుగుపడుతుంది. కూర్చోవడం, నడవడం వంటివి మరింత సహజంగా అనిపిస్తాయి. అలాగే ప్లాంట్ లేదా బోట్ వంటి భంగిమలు చేయడం వల్ల నడుము కింద భాగం ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోజూ యోగా చేయడం వల్ల భావోద్వేగాలు అదుపులో ఉంటాయి. 10 నిమిషాల పాటు యోగా చేయడం వల్ల త్వరగా స్పందించే గుణం తగ్గుతుంది. దీంతో కోపం, ఆందోళన వంటివి తగ్గి ప్రశాంతంగా ఆలోచించే గుణం పెరుగుతుంది. ఈ విధంగా యోగా మన శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని



# రేవంత్ ఆలోచనకు తగ్గట్లుగా ఫ్యూచర్ సిటీ కదిలేనా?



- కలల నగరమా.. కాగితాల నగరమా?
- ఆలోచన పెద్దది.. అమలు సాధ్యమేనా?
- ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ ఉందా?
- రెండేళ్లలో రేవంత్ పరీక్ష
- ప్రకటనల దాటి ప్రగతి కనిపిస్తుందా?

డెస్క్, నేటిధాత్రి:
రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు దాటింది. ఇక రేవంత్ రెడ్డికి ఉన్నది కేవలం రెండేళ్ల కాలం మాత్రమే. ఈ రెండేళ్లలో ఆయన అనుకున్న పనులు నెరవేరుస్తారా అన్నది అనుమానమే. ఎందుకంటే ఈ రెండున్నరేళ్లలో గట్టిగా ఒక నిర్మాణాత్మక పని కూడా చేపట్టలేదు. ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేదు. ఎందుకంటే కేవలం సంక్షేమ పథకాలతో నెట్టుకొస్తున్నారు. రేషన్ కార్డులు పెంచడం, సన్నబియ్యం ఇవ్వడం, రైతు భరోసా అందించడం వంటివన్నీ అభివృద్ధి కిందకు రావు.
ఈ క్రమంలో ఆయన పెద్ద పనిని తలపెట్టుకున్నారు. అదే ఫ్యూచర్ సిటీ. ఇప్పుడున్న హైదరాబాద్ ఇంతగా పెరగడానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. మెల్లగా ఇది విస్తరిస్తూ పెరిగిందే తప్ప రాత్రికి రాత్రే అభివృద్ధి చెందలేదు. చంద్రబాబు సైబరాబాద్‌కు బీజం వేసినా, ఇవాళ ఓఆర్ఆర్ వరకు నగరం విస్తరించడానికి దాదాపు రెండున్నర దశాబ్దాల కాలం పట్టింది.
అందువల్ల ఒక సిటీని నిర్మించాలంటే అనుకున్నంత ఈజీగా అమాంతంగా నిర్మించలేం. అమరావతి కోసం నిధులు ఉండీ చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. మధ్యలో జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతి ఇప్పట్లో పూర్తి అయ్యేలా కనిపించడం లేదు. పోలవరం నిర్మించడానికి కూడా దాదాపు 15 ఏళ్లు పట్టింది.
నిధులు ఉండి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగవచ్చు. కానీ ఫ్యూచర్ సిటీ కోసం రూపాయి కూడా వెచ్చించే పరిస్థితి కనిపించడం లేదు. నిధుల లేమి రాష్ట్రాన్ని పట్టి పీడిస్తోంది. అక్కడ భూములు సేకరించి ఉన్నాయి కాబట్టి ఫ్యూచర్ సిటీ కట్టేయలేం. కొన్ని కార్యాలయాలు తరలించినా, కొందరికి భూములు కేటాయించినా ఇది సాధ్యమయ్యే పనికాదు. దీనికి తోడు కేవలం రెండేళ్ల కాలం మాత్రమే ఉంది.
ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, నెట్ జీరో తరహాలో రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి రాజీ పడొద్దని కూడా చెప్పారు. ఈ మేరకు ప్రపంచస్థాయి నగరాలను అధ్యయనం చేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. ఇప్పటికే అక్కడ ఓ ఈవెంట్ నిర్వహించి, పెట్టుబడిదారులను ఆహ్వానించినా, అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎలా అడుగు వేస్తారో అధికారులకు కూడా అర్థం కావడం లేదు. ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై ఎన్ని ఆదేశాలు జారీ చేసినా నిర్దిష్ట ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉంటుంది.
ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాల నిర్మాణం తర్వాతే భూ కేటాయింపులు జరపాలన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు.
కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా తీసుకురావాలని, అవసరమైతే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.
భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు రూపొందించాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించడానికి "ఇన్వెస్ట్ తెలంగాణ" పేరిట ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, దీనికి లోగో, వెబ్‌సైట్ రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ముందుకొచ్చే వారికి ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకురావాలని, గ్రూప్-1 స్థాయి అధికారులను నియమించాలని సూచించారు.
ఇవన్నీ బాగానే ఉన్నా, అక్కడ మౌలిక వసతులు ముఖ్యంగా రోడ్లు, నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్ట కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా, అందుకు కేంద్రం త్వరగా నిధులు విడుదల చేయాల్సి ఉంది.
1500 ఎకరాల్లో డేటా సిటీని ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇంతవరకు బాగానే ఉన్నా, ఫ్యూచర్ సిటీ దేనికి ప్రాధాన్యం ఇవ్వబోతోందన్నది కూడా ముఖ్యమే. ఇప్పటికిప్పుడు అక్కడికి వెళ్లి ఉండలేం. అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎవ్వరూ కూడా నివసించలేరు. ఇది ఒకరకంగా చెప్పాలంటే త్రిశంకు స్వర్గాన్ని సృష్టించడమే అవుతుంది.
2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని, పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్ రెడ్డి ఇటీవలే ప్రకటించారు. బహుశా ఇదే ధీమాతో మరో పదేళ్లకు దీని గురించి ప్రణాళిక వేసుకున్నారా అన్నది తెలియదు.
ఒకవేళ సీఎం రేవంత్ రెడ్డిని ప్రజలు మరోమారు గెలిపించకపోతే ఫ్యూచర్ సిటీ భవిష్యత్తు ఏంటన్నది ప్రశ్నార్థకమే. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఎవరు సీఎం అన్నది అప్పుడే నిర్ణయిస్తారు. ఒక్క వైఎస్ విషయంలో మాత్రమే రెండో ఆలోచన లేకుండా ఆయనను సీఎంగా చేశారు.
అధిష్టానం ఎవరిని నిర్ణయిస్తే వారే ముఖ్యమంత్రి అని ప్రకటించడం కాంగ్రెస్ ఆనవాయితీ. దీనికి భిన్నంగా, వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి ప్రకటించుకున్నారు. ఆయన చేసిన ఈ ప్రకటన కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మింగుడుపడకపోవచ్చు.
అయితే తనకు తాను ఇలా ప్రకటించుకున్నా పరిస్థితులు మన చేతుల్లో ఉండవు. తమిళనాడు, కేరళ, బెంగాల్ పరిస్థితులు చూశాం. వచ్చే రెండేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉందన్న విమర్శలు ఉన్నాయి. కొంతమంది మంత్రులు సమాంతర వ్యవస్థలను నడుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాబట్టి నిర్మాణాత్మక వైఖరి అవసరం. అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. ప్రజల్లో ఇమేజ్ సంపాదించాలి.
ఇవన్నీ చేసి మళ్లీ అధికారంలోకి వస్తేనే ఫ్యూచర్ సిటీపై ప్రభావం ఉంటుంది. లేకుంటే ఈ రెండేళ్ల స్వల్ప కాలంలో ఇది మనుగడలోకి రావడం ముమ్మాటికీ సాధ్యం కాకపోవచ్చు.

# ఇరాన్‌తో తలగొక్కుకున్న అమెరికా

- భారీగా పెరిగిన సైనిక వ్యయం
- సుమారు రూ.2.4 లక్షల కోట్లు చేరినట్లు అంచనా

వాషింగ్టన్, నేటిధాత్రి:
ఇరాన్‌పై యుద్ధంతో అమెరికాకు భారీ నష్టం వాటిల్లిందని యుఎస్ కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ (సిఆర్ఎస్) ఒక నివేదికలో తెలిపింది. ఈ నష్టాల కారణంగా పెంటగాన్ అంచనా వేసిన సైనిక కార్యాచరణ వ్యయం భారీగా పెరిగి 29 బిలియన్ డాలర్లకు, అంటే సుమారు రూ.2.4 లక్షల కోట్లకు చేరినట్లు వెల్లడించింది.
ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడులకు దిగిన సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో అమెరికాకు చెందిన సుమారు 42 అత్యాధునిక యుద్ధ విమానాలు, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు పూర్తిగా ధ్వంసమవ్వడమో లేదా తీవ్రంగా దెబ్బతినడమో జరిగిందని ఈ నివేదిక పేర్కొంది.
వర్గీకరణ, కొనసాగుతున్న పోరాట కార్యకలాపాలు, బాధ్యతను గుర్తించడం వంటి పలు కారణాల వల్ల దెబ్బతిన్న లేదా ధ్వంసమైన విమానాల సంఖ్య సవరణకు లోబడి ఉండవచ్చని సిఆర్ఎస్ తెలిపింది.
ధ్వంసమైన లేదా దెబ్బతిన్న వాయుసేన ఆస్తులలో అత్యధికంగా 24 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, ఒక ఎంక్యూ-4సి ట్రిటాన్ డ్రోన్ ఉన్నాయి. వీటితో పాటు నాలుగు ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్లు, ఒక అత్యాధునిక ఎఫ్-35ఎ లైట్నింగ్ స్టీల్త్ ఫైటర్ జెట్, ఒక ఏ-10 థండర్‌బోల్ట్ గ్రౌండ్ అటాక్ ఎయిర్‌క్రాఫ్ట్ కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.
శత్రువుల దాడిలో ఏడు కెసి-135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానాలు, ఒక ఇ-3 సెంట్రీ అవాక్స్ నిఘా విమానం, రెండు ప్రత్యేక ఆపరేషన్ల విమానాలు, ఒక హెచ్‌హెచ్-60డబ్ల్యూ రెస్క్యూ హెలికాప్టర్ దెబ్బతిన్నట్లు నివేదిక స్పష్టం చేసింది.
యుఎస్ కాంగ్రెస్ కమిటీలకు విధానపరమైన, చట్టపరమైన విశ్లేషణను అందించే సిఆర్ఎస్, రక్షణ శాఖ, యుఎస్ సెంట్రల్ కమాండ్ వార్తా నివేదికలు, ప్రకటనలను పరిశీలించడం ద్వారా ఈ నష్టాలను అంచనా వేసింది.
అమెరికా రక్షణ శాఖ ఇప్పటివరకు అధికారికంగా నష్టాల పూర్తి వివరాలను వెల్లడించనప్పటికీ, దెబ్బతిన్న యుద్ధ పరికరాల మరమ్మతులు, పునరుద్ధరణ ఖర్చులు ఊహించిన దానికంటే విపరీతంగా పెరిగాయని పెంటగాన్ తాత్కాలిక కాంప్ట్రోలర్ జూల్స్ డబ్ల్యూ హర్స్ట్ ప్రతినిధుల సభలో అంగీకరించిన సంగతి తెలిసిందే.

# దార్శనికుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్ నాయుడు



చర్ల నేటిధాత్రి:
స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు విజయ్ నాయుడు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు అనంతరం సత్యనారాయణపురం రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర జరిగిన సమావేశం లో విజయ్ నాయుడు మాట్లాడుతూ సాంకేతిక విప్లవం భారతదేశంలో టెలికాం విప్లవానికి కంప్యూటర్ యుగానికి రాజీవ్ గాంధీనే ఆద్యుడన్నారు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించారని నవోదయ విద్యాలయాలు గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి జవహర్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించారన్నారు స్థానిక సంస్థలు పంచాయతీ రాజ్ వ్యవస్థల బలోపేతానికి రాజ్యాంగ సవరణలు తెచ్చారని దేశానికి వారు అందించిన సేవలను ఈ వేదికగా ప్రజలకు తెలియ చేసారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్ నాయుడు పీసీసీ జెనరల్ సెక్రటరీ నల్లపు దుర్గ ప్రసాద్ డీసీసీ ఉపా అధ్యక్షులు చీమల మరి మురళి డీసీసీ జనరల్ సెక్రటరీ సోడి చలపతి మరియు బీసీ సెల్ ఆర్ వి రమణ ఎస్సి సెల్ కారంపూడి సల్మాన్ మరియు వందే నరసింహమూర్తి ఎస్టీ సెల్ తాటి రామకృష్ణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇందల రమేష్ ఆవుల పుల్లరావు ముమ్మినేని అరవింద్ పోలిన లంకరాజు బ్రహ్మానందరెడ్డి గుండెపూడి భాస్కరావు మీడియం శోభారాణి బంగారం ఆర్ కొత్తగూడెం ఉపసర్పంచ్ ఆకుల కృష్ణ ఎక్స్ ఎంపిటిసి కుంజా నాగేశ్వరరావు చంటి మునిగాల సాగర్ పూజారి రమణయ్య మునిగేల వేంకన్న మెడబత్తిన వాసు మనోహర్ శంకర్ శివ వంశీ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ ఆలం ఈశ్వర్ రాము తోకల దిలీప్ కుమార్ తాటి బాలకృష్ణ సోమరాజు దానావైపేట్ నిరోషా దేవరపల్లి తెల్లం కన్నయ్య శ్యామల గోవిందు తెల్ల మురళి పోడియం జగదీష్ మరియు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సామ్రాజ్యం సత్యనారాయణ పురం సర్పంచి జాగా గౌతమి కలివేరు ఉప సర్పంచ్ రుక్మిణి సున్నం గుంపు నాయకులు మరియు కాంగ్రెస్ నాయకులు అనుబంధ సంఘాల నాయకులు అభిమాన సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు మరియు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# విదేశీ పర్యటన ముగించుకుని ఢిల్లీకి చేరుకున్న ప్రధాని మోదీ



- విదేశీ ప్రతినిధులకు విలువైన కానుకలు అందజేత
- కానుకలతో భారతీయత చాటిన మోదీ
- ప్రపంచ నేతల చేతుల్లో భారత కళారూపాలు
- దౌత్యంతో పాటు సంస్కృతి ముద్ర
- బహుమతుల్లో భారత వైభవం

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ప్రధాని నరేంద్ర మోదీ ఐదు దేశాల పర్యటనను ముగించుకుని గురువారం భారత్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనల నేపథ్యంలో మోదీ ఆయా దేశాల నేతలకు భారత సంస్కృతి ఉట్టిపడేలా పలు కానుకలు అందజేశారు.
ఇటలీ అధ్యక్షుడికి పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎంఎస్ సుబ్బులక్ష్మి పాటల సీడీలు కలిగిన మార్బుల్ ఇన్‌లే వర్క్ బాక్స్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అస్సాంలో ప్రసిద్ధి చెందిన ముగా సిల్క్ శాలువాను బహుకరించారు.
తెల్లని పాలరాయితో తయారుచేసిన ఈ బాక్స్‌పై లాపిస్ లాజులి, టర్కోయిస్, మాలకైట్, పగడం వంటి రాళ్లను అలంకరించారు. ఈ బాక్స్ లోపల భారత శాస్త్రీయ సంగీతంలోని ప్రముఖులైన పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎంఎస్ సుబ్బులక్ష్మి పాడిన పాటల సీడీలు ఉన్నాయి.
ఇక మెలోనీకి అస్సాంలో "గోల్డెన్ సిల్క్"గా గుర్తింపు పొందిన ముగా సిల్క్ శాలువాను బహుమతిగా ఇచ్చారు. మణిపూర్‌కు చెందిన శిరుయ్ లిల్లీ సిల్క్ స్కార్ఫ్‌ను కూడా గిఫ్ట్‌గా అందించారు.
నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌కు చేపల ఆకృతితో ఉన్న మధుబని పెయింటింగ్‌ను బహుమతిగా ప్రధాని మోదీ అందజేశారు. ఈ మధుబని పెయింటింగ్ అత్యంత ప్రాచీనమైనది. ఈ పెయింటింగ్ భౌగోళిక గుర్తింపు పొందింది.
జానపద కళను ప్రతిబింబించే ఈ పెయింటింగ్‌లు భారత్, నేపాల్‌లోని మిథిలా ప్రాంతంలో ప్రాచుర్యంలో ఉన్నాయి. పండగలు, వివాహాలు, ఆచార వ్యవహారాలు తదితర శుభకార్యాలకు సూచికగా ఈ పెయింటింగ్స్ వేస్తారు.
ఈ మధుబని పెయింటింగ్స్‌కు సంబంధించిన మూలాలు భారతీయ పురాణాలు, జానపద కథల్లో ఉన్నాయి. పువ్వులు, పక్షులు, చెట్లు, చేపల వంటి ఆకృతుల ద్వారా దేవతలు, ప్రకృతితో పాటు రోజువారీ జీవిత దృశ్యాలు ఈ పెయింటింగ్స్‌లో కనిపిస్తాయి.
నెదర్లాండ్స్ ప్రధానికి ఈ కానుక ఇవ్వడం ద్వారా భారతీయ సంస్కృతి, ముఖ్యంగా మిథిలా కళారూపాన్ని పరిచయం చేసినట్లు అయిందనే చర్చ సాగుతోంది.

# చంద్రగిరి మండలంలో అర్ధరాత్రి ఏనుగుల బీభత్సం



తిరుపతి, నేటిధాత్రి:
తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం రంగంపేట సమీపంలోని నాగపట్ల ప్రాంతం, రాగిమానుగుంటలో ఏనుగుల గుంపు బుధవారం రాత్రి బీభత్సం సృష్టించింది.
అర్ధరాత్రి మామిడి తోటలోకి వచ్చిన ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేశాయి. ఏనుగుల గుంపు గ్రామ పరిసరాల్లోకి చొరబడి, అర్ధరాత్రి పంట పొలాల్లో భీకర శబ్దాలతో గీంకరిస్తుండటంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.
రైతుల మామిడి తోటలు, ఫెన్సింగ్ కంచెలు, నీటి పైపులను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేశాయి. మూడు రోజులుగా నాగపట్ల ప్రాంతంలోనే గజరాజులు సంచరిస్తున్నట్లు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు తెలియజేశారు.
అటవీశాఖ అధికారులు ఏనుగులను అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు బాణాసంచా పేలుస్తూ, డప్పుల శబ్దాలతో ప్రయత్నాలు చేపట్టారు. పంట నష్టం తప్ప ఎటువంటి ప్రాణాపాయం జరగలేదని అధికారులు తెలిపారు. గ్రామస్తులు రాత్రిపూట బయటకు రాకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

# తిరుమలలో పెరిగిన రద్దీ

- వేసవి సెలవులతో భక్తుల రాక
- దర్శనానికి 24 గంటలకు పైగా సమయం

తిరుమల, నేటిధాత్రి:
వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో రద్దీ పెరుగుతోంది. శ్రీవారి దర్శనానికి కనీసం 24 గంటలకుపైగా సమయం పడుతోంది.
శ్రీవారి దర్శనానికి గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. దీంతో భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2, నారాయణగిరి షెడ్లు నిండిపోయి, రింగ్ రోడ్డులోని పాచికాల్వ గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వేచి ఉన్నారు.
సర్వదర్శనానికి 24 గంటలకుపైగా సమయం పడుతోందని తితిదే ప్రకటించింది. రద్దీ నేపథ్యంలో సంయమనంతో శ్రీవారిని దర్శించుకోవాలని తితిదే భక్తులకు సూచిస్తోంది.
మరోవైపు తితిదే ఆధ్వర్యంలో ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు, అన్నప్రసాద కేంద్రాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను అంచనా వేసి అధికారులు అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.
క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, అన్నప్రసాదాలు శ్రీవారి సేవకుల ద్వారా అందిస్తున్నారు. తితిదే యంత్రాంగం సమన్వయంతో భక్తులకు దర్శనం కల్పించేందుకు 24 గంటలూ ప్రత్యేకంగా దృష్టి సారించారు.
పోలీసులు, తితిదే విజిలెన్స్ అధికారులు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి రద్దీని నియంత్రిస్తున్నారు. రద్దీ నేపథ్యంలో అధికారులు భక్తులను క్యూలైన్లలోకి అనుమతించడం లేదు.

# భద్రతా మండలిలో మరోమారు పాక్ దుర్నీతి

- గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి
- నరమేధం చేసే పాక్‌కు మాట్లాడే హక్కులేదని విమర్శలు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మరోసారి భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వాటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది.
సాయుధ ఘర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ జరిగింది. ఈ సందర్భంగా పాక్ ప్రతినిధి జమ్మూ-కాశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ గట్టిగా తిప్పికొట్టారు.
నరమేధ చర్యలకు పాల్పడే దేశం భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది ఆరంభంలో అఫ్గానిస్థాన్‌పై పాక్ జరిపిన దాడుల గురించి హరీష్ ప్రస్తావించారు.
పవిత్ర రంజాన్ మాసంలో కాబూల్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన దాడిని ప్రపంచం ఇంకా మరిచిపోలేదన్నారు. ఈ అమానుషమైన హింసాకాండలో 269 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 122 మంది గాయపడినట్లు తెలిపారు.
"చీకట్లో అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ, అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనం" అని విమర్శించారు.
తన సొంత ప్రజలపైనే బాంబులు వేస్తూ, జాతి నిర్మూలనకు పాల్పడే దేశం ఇలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడటంలో పెద్ద ఆశ్చర్యం కలిగించే విషయం కాదన్నారు.

# రూపాయి పతనంపై ఆర్‌బీఐ దిద్దుబాటు

## అధికారులతో గవర్నర్ మల్హోత్రా మంతనాలు



- రూపాయి పతనంపై ఆర్‌బీఐ అప్రమత్తం
- డాలర్ దెబ్బకు కుదేలైన రూపాయి
- ఆర్థిక మార్కెట్లపై పెరుగుతున్న ఒత్తిడి
- పతనానికి బ్రేక్ వేసేందుకు ఆర్‌బీఐ యత్నాలు

ముంబయి, నేటిధాత్రి:
రూపాయి విలువను స్థిరీకరించడానికి, వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరిశీలిస్తోందని సంబంధిత అధికారులను ఉద్దేశించి 'బ్లూమ్‌బెర్గ్' గురువారం ఒక నివేదికలో వెల్లడించింది.
రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో సహా ఆర్‌బీఐ ఉన్నతాధికారులు వరుస అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు ఈ నివేదిక పేర్కొంది.
గడిచిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి అంతర్గతంగా 96.95 వద్ద రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని డాలర్‌తో పోలిస్తే 96.86 వద్ద ముగిసింది.
అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ బలంగా ఉండటం, ముడిచమురు ధరలు అధికంగా కొనసాగడంతో డాలర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ పరిణామాల వల్లే రూపాయి విలువ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయి, కొత్త ముగింపు రికార్డును నమోదు చేసింది.
అయితే, గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి తన సర్వకాలిక కనిష్ట ముగింపు స్థాయి నుంచి 41 పైసలు పుంజుకుని అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.45కు చేరుకుంది.
ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.25 వద్ద బలంగా ప్రారంభమై, ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 96.45 వద్ద ట్రేడయ్యింది. బుధవారం నాటి ముగింపు ధర 96.86తో పోలిస్తే ఇది 41 పైసల రికవరీని సూచిస్తోంది.

# విశాఖలో మూడు కీలక ప్రాజెక్టులు



విశాఖపట్నం, నేటిధాత్రి:
విశాఖలో మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధికి సంబంధించి మూడు కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు విశాఖ ఎంపీ శ్రీ భరత్ తెలిపారు.
అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద జివిఎంసి ప్రతిపాదించిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపినట్లు వివరించారు.
రూ.1,501.03 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టులను అమలు చేయనున్నట్లు చెప్పారు.
మధురవాడ జోన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి రూ.658.61 కోట్లు, మధురవాడ జోన్‌లో స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ కోసం రూ.725.18 కోట్లు, బల్క్ మరియు సెమీ బల్క్ నీటి సరఫరా వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ.117.24 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.
ఈ మూడు ప్రాజెక్టులు విశాఖపట్నం పట్టణ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు.

# పాక్‌లోనే పహల్గాం దాడికి పథకం



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాఖలు చేసిన చార్జిషీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఉగ్రదాడికి సంబంధించిన వ్యూహరచన, పథకం అమలు అంతా పాకిస్థాన్ కేంద్రంగానే సాగిందనే విషయాన్ని బలమైన ఆధారాలతో ఎన్ఐఏ వెల్లడించింది. ఈ ఘటన జరిగిన వెంటనే ఈ దాడికి తామే బాధ్యులమంటూ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించింది. ఈ దాడికి వ్యూహరచన నుంచి టీఆర్ఎఫ్ చేసిన ప్రకటన వరకు అన్నీ పాకిస్థాన్‌లోనే జరిగాయని ఎన్ఐఏ వివరించింది. అందుకు సంబంధించిన ఫోన్ కాల్స్, ఐపీ చిరునామాలు తదితర అంశాలను ఈ చార్జిషీట్‌లో పొందుపరిచింది. ఈ ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఫైజల్ జాట్ అలియాస్ సులేమాన్ షా, హబీబ్ తాహిర్ అలియాస్ జిబ్రాన్, హమ్జా అఫ్ఘానీకి సంబంధించిన ఐపీ చిరునామాలు, ఫోన్ నంబర్లు తదితర ఆధారాల ద్వారా వీరికి పాక్‌లోని సూత్రధారులతో సంబంధాలు ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది.
సైనిక బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ మహాదేవ్'లో ఈ ముగ్గురు ఉగ్రవాదులను కాల్చిచంపాయి. వారి నుంచి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాయి. అవి పాక్‌లోనే కొనుగోలు చేసినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. ఈ మొబైల్ ఫోన్లు లాహోర్, కరాచీలలో కొనుగోలు చేసినట్లు గుర్తించారు.
2025 ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలోకి ఉగ్రవాదులు ప్రవేశించి పర్యాటకులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మొత్తం 25 మంది మరణించారు.
ఈ కాల్పుల ఘటనకు తామే బాధ్యులమని లష్కరే తోయిబా అనుబంధ సంస్థ టీఆర్ఎఫ్ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించింది. దీనిపై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తడంతో టీఆర్ఎఫ్ వెనక్కి తగ్గింది.
ఈ టీఆర్ఎఫ్ ప్రకటనపై కూడా ఎన్ఐఏ విచారణ జరిపింది. ఇవి కూడా పాకిస్థాన్ నుంచే వచ్చినట్లు వివరించింది.
ఉగ్రదాడికి టీఆర్ఎఫ్‌కు చెందిన ఉగ్రవాది సైఫుల్లా అలియాస్ సాదిక్ జాట్ కీలక సూత్రధారి అని ఎన్ఐఏ స్పష్టం చేసింది. అతడి ఆదేశాల మేరకే తీవ్రవాదులు బైసరన్ లోయలో రెక్కీ నిర్వహించినట్లు తన చార్జిషీట్‌లో వెల్లడించింది. ఈ దాడి జరిగిన రోజు ఆ తీవ్రవాదులతో సైఫుల్లా నిరంతరం చర్చలు జరిపినట్లు గుర్తించామని ఎన్ఐఏ తెలిపింది. అంతేకాకుండా ఈ దాడి తర్వాత ఎలా తప్పించుకోవాలనే అంశాన్ని కూడా ఉగ్రవాదులకు సైఫుల్లా వివరించినట్లు పేర్కొంది. ఈ అంశాలన్నింటినీ ఎన్ఐఏ తన చార్జిషీట్‌లో పొందుపరిచింది. మరోవైపు ఈ పహల్గాం ఉగ్రదాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని పాకిస్థాన్ స్పష్టం చేసింది. భారత్ తమపై కావాలని ఆరోపణలు చేస్తోందంటూ ప్రపంచానికి పాక్ చెప్పే ప్రయత్నం చేసింది. కానీ అమాయకుల ప్రాణాలు బలిగొన్న ఈ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ ప్రమేయం ఉందని ఎన్ఐఏ తన దర్యాప్తులో తేల్చింది.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999